వాహిని
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కరీంనగర్ : fb.com/vaartha Digital

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 287 పేజీలు: 8+16 వెల: 6.50

# నిద్రలోనే.. అగ్నికి ఆహుతి

సౌది అరేబియాలోని మదీనా సమీపంలో ఘోర ప్రమాదం

డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొని బస్సుకు నిప్పు

రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తెలంగాణ సర్కారు

మైనారిటీ శాఖ మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యే సహా ఉన్నతాధికారుల బృందం సౌదీకి

మృతుల్లో పలువురికి అక్కడే అంత్యక్రియలు



## హైదరాబాద్ వాసులు 45 మంది సజీవ దహనం

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది సజీవ దహనం అయ్యారు. హైదరాబాద్ వాసులు ప్రయాణిస్తున్న బస్సు భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున ఒంటి గంటన్నర సమయంలో డీజీల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో అందులోని ఇంధనం ఒక్కసారిగా బస్సుపై పడడం, బస్సులో ప్రయాణిస్తున్న వారు గాఢ నిద్రలో వుండడంతో నిమిషాల వ్యవధిలో కాలిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరు తప్పించుకోగా అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. మృతుల్లో విద్యానగర్, బహదూర్‌పురా, బజార్‌ఘాట్, మల్లేపల్లి వాసులే ఎక్కువగా వున్నారు. ఇందులో విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబం వాసులు 18 మంది మరణించారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు వున్నారు. కాగా ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. మైనా రిటీ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో పాటు మజ్లిస్ ఎంఎల్ఎ, ఆ శాఖ ఉన్నతాధికారులతో కూడిన బృందాన్ని, వీరి వెంట బాధిత కుటుంబం నుంచి ఇద్దరేసి చొప్పున సౌదీకి పంపేందుకు సర్కారు నిర్ణయించింది. కాగా మృతుల్లో పలువురికి సౌదీలోనే అంత్య క్రియలు నిర్వహించాలని వారి బంధువుల సూచనల మేరకు ప్రభుత్వం నిర్ణయించింది. >>2

ప్రధాని మోడీ, సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి 2లో

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరి శిక్ష



ఐసిటి సంచలన తీర్పు

24 అల్లర్లలో 1400 మంది మృతికి కారకురాలుగా నిర్ధారణ

ఢాకాలో అల్లర్లు.. భద్రత పెంపు

హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరిన బంగ్లాదేశ్

ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం: హసీనా

**ఢాకా/న్యూఢిల్లీ, నవంబరు 17:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ,ఆదేశ మాజీప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసిటి) మరణశిక్ష విధించింది. ఆమెపై దాఖలైన హత్యానేరం కేసుల్లో ఈ మేరకు తీర్పు వెలువరించింది. నిరసనల అణిచివేతకు హసీనాప్రభుత్వం ఫైర్‌ఆర్మ్స్, హెలికాప్టర్లు సహా మారణాయుధాలను మొహరించిందని, ఫలి >>2

## మళ్లీ నితీషే సిఎం 5లో

20న బీహార్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు



ఢిల్లీ పేలుడు కేసు:

## మరో కుట్రదారుడు అరెస్టు

**న్యూఢిల్లీ, నవంబరు 17:** ఢిల్లీ బాంబు బ్లాస్ట్ కేసులో దర్యాప్తు శరవేగంతో సాగుతోంది. ఉగ్రదాడి దాడిలో ఉగ్రవాది డాక్టర్ ఉమర్‌కు సహకరించిన జసీర్ బిలాల్ వాని అలియాస్ డానిష్ అనే వ్యక్తిని ఎన్ఐఎ అరెస్ట్ చేసింది. ఇతను ఉమర్ నబీతో కలిసి ఉగ్ర కుట్రలకు పాల్పడినట్టి అధికారులు గుర్తించారు. ఇతను పేలుడు కోసం సాంకేతిక పరికరాలను సహాయం చేయడంతో పాటు దాడి సమయంలో బాంబ్ పేలుడును డ్రోన్ల ద్వారా ఆపరేట్ చేసినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ డానిష్ రాకెట్లను కూడా తయారు చేసేవాడని అధికారులు గుర్తించారు. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని ఖాజిగుండ్‌కు చెందిన డానిష్ ఈ దాడిలో కీలకంగా వ్యవహరించాడని అధికారులు పేర్కొన్నారు. ఉగ్రదాడికి ముందు డ్రోన్‌లను సవరించడం, రాకెట్‌లను నిర్మించడంలో జాసిర్ సాంకేతిక సహాయాన్ని అందించాడని ఎన్ఐఎ దర్యాప్తులో తేలింది. ఇతను ఉగ్రవాది ఉమర్‌నబీతో కలిసి ఈ మారణ హోమా >>2

# వచ్చేనెల పంచాయతి ఎన్నికలు

కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాక ఎంపిటిసి, జడ్పిటిసి

కాంగ్రెస్ పార్టీ పరంగా బిసిలకు 42 శాతం కోటా

అందెశ్రీ స్మృతివనం, కుమారునికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం

పాఠ్యపుస్తకాల మొదటి పేజీలో 'జయజయహే తెలంగాణ'

గిగ్ వర్కర్ల సోషల్ సెక్యూరిటీ వెల్ఫేర్ యాక్ట్‌కు ఆమోదం

డిసెంబరు 8,9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

కేబినెట్ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి




సోమవారం కేబినెట్ భేటీ అనంతరం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు17:** గ్రామాల్లో పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో వీలైనంత తొందరలోనే (డిసెంబర్‌లో) పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం కాల పరిమితి వచ్చే 2026 మార్చ్ 31తో ముగియనుంది. అప్పటిలోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయకపోతే గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులు దాదాపు రూ. 3 వేల కోట్లు రాకుండా పోతాయి. అందుకే ఈ డిసెంబరు నెలలోనే పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం అధికారులను ఆదేశించింది. సోమవారం సాయంత్రం ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం సుదీర్ఘంగా జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను రెవెన్యూ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాత్రి పొద్దుపోయాక మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన తీర్పు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్ల పరిమితి కి మించకుండా ఎన్నికలకు వెళ్లాల్సి ఉంది. డెడికేటెడ్ కమిషన్ బిసి లకు 42 శాతం ప్రకారం రిజర్వేషన్ల జాబితాను ఇప్పటికే ఇచ్చింది. దాని ఆధారంగానే ఎన్నికల ప్రక్రియ కూడా మొదలైంది. కోర్టు కేసులతో ఎన్నికల ప్రక్రియ అర్ధంతరంగా నిలిచి పోయింది. ఇప్పుడు ఎన్నికలకు వెళ్లాలంటే 50 శాతం మించకుండా రిజర్వేషన్ల జాబితాను మరోసారి డెడికేటెడ్ కమిషన్ నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని కేబినెట్ తీర్మానం చేసిందని ఆయన వెల్లడించారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి కేబినెట్ ఆమోదం పొందాలని సూచించింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా బిసిలకు 42శాతం ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు.. సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని నిర్ణయం తీసుకుంది. చనిపోయినవారి మృతదేహాలను మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని, బాధిత కుటుంబ సభ్యులను >>2

రాష్ట్రంలోనూ గతంలో

# ఓటు చోరీ

దొడ్డిదారిలో ఎన్డీయె విజయాలు: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, నవంబరు 17,ప్రభాతవార్త:** దొడ్డి దారిలో ఎన్డిఎ కూటమి కేంద్రంలో దేశంలోని ఇతర రాష్ట్రాలలో విజయాలు సొంతం చేసకొంటుందని ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల ఫలితాలు వెలువడకుండా అక్రమపద్దతలు ఆచరిస్తున్నారని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఓట్ చోరికి వ్యతిరేకంగా తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టగా ముఖ్య అతిథిగా హాజరైన పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,మంత్రి పొన్నం ప్రభాకర్,జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ భాను,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి, కోట నీలిమ, ఇతర ముఖ్యనేతలు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొని సంఘీభావంతెలిపారు. పిసిసిఅధ్యక్షుడు మహేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటుహక్కు ప్రతి పౌరుడు రాజ్యాంగ హక్కు. అది చోర్ అవుతుందనీ ఆవేదన చెందారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరిట బిహార్‌లో ఓట్ల తొలగింపు జరిగిందనీ ఆయన అన్నారు. రాజ్యాంగ బద్ధంగా, న్యాయ బద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే మహాగడ్ బంధన్ కు 200 సీట్లు వచ్చేవనీ ఆయన స్పోత్కర్షలు చెప్పుకొన్నారు.ఓట్ చోరీ ద్వారా ఎన్నికలు జరిగితే దేశ భవిష్యత్, ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఒకప్పుడు >>2

# 'ఐబొమ్మ' చేతిలో 20 కోట్లు!

నిర్వాహకుడు రవి నుంచి రూ. 3 కోట్లు సీజ్

అతడి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా

హార్డ్‌డిస్క్‌లో 21 వేల పైరసీ సినిమాలు: సిపి సజ్జనార్



సోమవారం హైదరాబాద్‌లో ఐ బొమ్మ నిర్వాహకుడి దారుణాలు, సినిమాల పైరసీపై సిపి సజ్జనార్‌తో మాట్లాడుతున్న సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు, రాజమౌళి

**హైదరాబాద్, నవంబరు 17 ప్రభాతవార్త:** సినిమా పరిశ్రమకు పైరసీ వల్ల చాలా నష్టం జరిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు. పైరసీ మాస్టర్‌మైండ్, ఐబొమ్మ నిర్వాహకుడు రవిని అరెస్టుచేసినట్లు తెలిపారు. అతనిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లుచెప్పారు. పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో సినీపెద్దలు చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు, రాజ >>2




## స్తంభించిన పత్తి కొనుగోళ్లు

మార్కెట్ యార్డులు నిర్మానుష్యం

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** జిన్నింగ్ మిల్లుల సమ్మెతో రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (సిసిఐ) అమల్లోకి తెచ్చిన నిబంధలను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు సోమవారం నుండి సమ్మెలోకి దిగాయి. ఎక్కడిక్కడ పత్తి కొనుగోళ్లను నిలిపివేయడంతో పత్తి బేళ్లతో రైతులు హడావిడీగా ఉండే >>2

నేటి నుండి కొనుగోళ్లు జరపండి
జౌళి అధికారులతో మంత్రి తుమ్మల 3లో

# నిర్ణయం మీదా! మాదా?



ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌ను ప్రశ్నించిన సుప్రీం కోర్టు

స్పీకర్‌కు రాజ్యాంగంలో రక్షణ లేదని ముందే చెప్పాం

కోర్టు ధిక్కరణ కింద నోటీసులు జారీ

4 వారాల్లో జవాబు చెప్పాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు17:** తెలంగాణలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈ లోపు నిర్ణయం తీసుకోవాలని ఆయనకు సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు (నెల రోజులు) వాయిదావేసింది. తెలంగాణలో పది మంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు సిజెఐజస్టిస్ బిఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పందిస్తూ తెలంగాణ ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కోర్టుధిక్కార పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి ధర్మా >>7

## నకిలీ బ్యాంకుతో అమాయకులకు టోకరా

హైదరాబాద్‌లో అల్‌ఫలా వర్సిటీ ఛైర్మన్ సోదరుడి అరెస్టు 5లో

సౌదీ దుర్ఘటనలో ఒకే కుంటుంబానికి చెందిన

# 18 మంది మృత్యువాత

## విద్యానగర్‌లో విషాదఛాయలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), నవంబరు 17, ప్రభాతవార్త :** సౌదీ అరేబియా రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన 18 మంది మృత్యువాత పడ్డారు. అంతా నిద్రలో ఉండగా ప్రమాదం చోటుచేసుకుకోవడంతో ఒక్క మినహా అంతా మృత్యువాత పడ్డారు. ఈ నెల 9న హైదరాబాద్ విద్యానగర్కు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి నజీరుద్దీన్ (70) తన భార్య అత్తర్ బేగం (80), కూతుళ్లు, కుమారులు, మనవలతో కలిసి మొత్తం 18 మంది సౌదీ అరేబియాకు భయలు దేరి వెళ్లారు. ఉమ్రా యాత్ర వెళ్తుండగా ఉదురుగా వస్తున్న రాత్రి సమయంలో డీజీల్ ట్యాంకర్ వారు ప్రయాణిస్తున్న బస్సు డీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు అంటుకొని అక్కడికక్కడ అగ్నికి ఆహుతి అయ్యారు. మృతుల్లో నజీరుద్దీన్ కుమారుడు సల్లావుద్దీన్(38), అతని భార్య పారానా సుల్తానా (37), అమెరికాలో ఉండే పెద్ద కుమారుని భార్య సనా సుల్తానా (35), ముగ్గురు బిడ్డలు అమనాబేగం (35), రిజ్వాన్ బేగం(37), షమీనాబేగం(39), అక్తర్ బేగం(83), మరియం ఫాతిమా (3), మేరిష్ పాతిమా(10), మహ్మద్ షాజిన్(2), రైజు తజిమ్(10), సాలాఉద్దీన్ షేక్ (42), షేక్ డైనుద్దీన్(12), తసీమా తహరీన్ (3), ఉజారుద్దీన్ షేక్(3), హనీఫ్, ఆజర్లు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడంతో విద్యానగర్లో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలియగానే విద్యానగర్ మార్క్స్ భవన్ సమీపంలోని నసీరుద్దీన్ నివాసం బందువులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నసీరుద్దీన్ అందరితో చనువుగా ఉండే వారని, ఆయనతో పాటు కుటుంబ సభ్యులు అంతా మృత్యువాత పడటం అందరిని కలచివేసింది. కాగా అమెరికాలో ఉంటున్న నజీరుద్దీన్ పెద్దకుమారుడు సిరాజుద్దీన్ ఒక్కరే ఆ కుటుంబంలో మిగిలాడు. అతను అమెరికా నుంచి రావడానికి వీలుకాక పోవడంతో మా యాత్రకు రాలేకపోయారు.

**మరో కుటుంబానికి చెందిన భర్త, భార్య, కొడుకు మృతి**



**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 17, ప్రభాతవార్త :** సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఐదుగురు మృతి చెందారు. చని పోయిన వారిలో ఒకే కుటుంబానికి భార్యభర్తలు, కొడుకు ఉన్నారు. కాగా అంజాద్‌దౌలాబాగ్‌కు చెందిన ఇద్దరు చనిపోయారు. ఈ విషయం తెలియగానే బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ ముబీన్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. నవంబరు నెల 9న పాతబస్తీలోని ఫలక్‌నుమా ప్యాలెస్ వెనుక ఉన్న ఫారూఖినగర్‌కు చెందిన భార్యాభర్తలైన మహ్మద్ మస్తాన్ (55), జికియా బేగం (47), కొడుకు సోహెల్ (23) కలిసి ఉమ్రాకు వెళ్లారు. శాలిబండ పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్జాద్‌దౌలాబాగ్‌కు చెందిన సారా బేగం (60), సలీంఖాన్ (30)లు ఉమ్రాకు వెళ్లినట్లు శాలిబండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపారు. కాగా సోమవారం తెల్లవారు జామున సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫారూఖినగర్‌కు చెందిన భార్యాభర్తలైన మహ్మద్ మస్తాన్, జకియా బేగం, కొడుకు సోహెల్, అమ్జాద్ దౌలాబాగ్‌కు చెందిన సారా బేగం, సలీంఖాన్‌లు మృతి చెందారు. బహదూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ బాధిత కుటుంబాల బంధువులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలోని ఫారూక్‌నగర్, అంజాద్‌దౌలాబాగ్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా బాధిత కుటుంబాలకు సౌదీ అరేబియా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ డిమండ్ చేశారు.

# బాసర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతుకు రూ.117.80 లక్షలు మంజూరు

**హైదరబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా బాసరలోని ఎత్తిపోతల పథకం అత్యవసర మరమ్మతుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకకోటి 17లక్షల 80వేల రూపాయలు మంజూరు చేస్తూ పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ సోమవారం జివో 303ను జారీచేసింది. గోదావరి నది పక్కన ఉన్న ఇన్‌టేక్‌వెల్ కోతకు గురికావడంతోపాటు పూడిక వేస్ట్‌మెటిరియల్ చేరుకోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ముథోల్ నియోజకవర్గంలోని ఆయ కట్టు రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైంది. పైపులైను, మోటారు మరమ్మతులు సాగునీటి నిర్వహణ వంటి అంశాలలో మరమ్మతులు చేపట్టి ముథోల్ నియోజకవర్గంలో సుమారు 20 చెరువులకు నీరు అందిం చేలా బాసర లిఫ్ట్ ఇరిగేషన్ సిద్ధం చేసేందుకు కార్యచరణ రూపొందించారు. ప్రస్తుతం 250 ఎకరాలకు పరి మితమైన ఈ ప్రాజెక్టు మరింత ఎక్కువ విస్తీర్ణంలో సాగునీరు అందించడానికి భూగర్భజలాల పెంపుకు దోహదపడుతోంది.

# జూబ్లీహిల్స్ ఎన్నికల కోడ్ ఎత్తివేత : ఎన్నికల కమిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 17:** జూబ్లీహిల్స్‌లో అమలులో ఉన్న ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం అక్టోబర్ 6న ఎన్నిక షెడ్యూల్‌ను విడుదల చేయడంతో కోడ్ అమలులోకి వచ్చిన తెలిసిందే. ఈనెల 11న ఎన్నిక, 14న ఎన్నికల ఫలితం వెలువడిన విషయమూ విధితమే. అయితే, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసిసి)ను ఎన్నికల కమిషన్ ఎత్తివేసినట్లు ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి అమలులో ఉన్న ఎంసిసి, ఉప ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక కోడ్ వర్తించదని ఉత్తర్వులో పేర్కొన్నది.

# నటుడు బాలకృష్ణకు సి.వి.ఆనంద్ క్షమాపణలు

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ సినీనటుడు హిందుపూర్ ఎంఎల్ఎ బాలకృష్ణకు తన ట్విట్టర్ నుంచి తెలియకుండా వెలువడ్డ ట్విట్‌కు క్షమాపణలు తెలిపారు. వివరాల్లోకి వెళితే గత సెప్టెంబర్ నెలలో ఐ బొమ్మకు సంబంధించిన సి నీ పైరసీ ముఠాను సిటీ పోలీసులు పట్టుకున్నారు. ఆ సమయంలో సిటీ పోలీసు కమిషనర్‌గా ఆనంద్ వున్నారు. ఈ ముఠాను పట్టుకున్న సమయంలో ఆనంద్ సినీ నటులు చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు తదితరులతో భేటీ అయ్యారు. అయితే ఈ భేటీకి బాలకృష్ణ ను పిలవక పోవడంపై నెటిజన్ స్పందిస్తూ మూడుసార్లు ఎంఎల్ఎ అయిన ఆయనను పిలవక పోవడం సరైంది కాదని అన్నారు. దీనిపై బాలకృష్ణ అసెంబ్లీలో ప్రశ్నిస్తారని ట్విట్ చేశారు. అయితే నెటిజన్ ట్విట్‌కు ఆనంద్ హ్యాండ్లర్ నుంచి అనుకోకుండా మరో ట్విట్ వచ్చింది. ఇదికాస్త వ్యంగంగా వుండడంతో బాలకృష్ణ అభిమానులు ఆగ్రహం చెందారు. తమ హీరోను కించపరుస్తారా...? అంటూ కామెంట్లు చేశారు. రెండు నెలలుగా ఈ వివాదం కొనసాగుతుండగా దీనిపై సోమవారం ఆనంద్ మరో ట్విట్ చేస్తూ ఇది అనుకోకుండా జరిగిందని, దీనిని తాను ట్విట్ చేయలేదని, తన హ్యాండ్ల ర్ చేశాడని, ఇందుకుగానూ తాను హ్యాండ్లర్‌ను తొలగించడంతో పాటు బాలకృష్ణకు వ్యక్తిగతంగా అప్పుడే క్షమాప ణలు చెప్పానని, ఈ వివాదాన్ని ఇంతటితో వదిలేయాలని కోరారు.

# సౌదీ దుర్ఘటనపై చంద్రబాబు, పవన్, భట్టి దిగ్భ్రాంతి

## కెసిఆర్, జగన్, పలువురు మంత్రులు, షర్మిల సంతాపాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 17:** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణకు చెందిన పలువురు ఉమ్రా యాత్రికులు మరణించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహా పలువురు నేతలు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. 'పవిత్ర ఉమ్రా యాత్రలో తెలంగాణకు చెందిన మన సోదర సోదరీమణులు మరణించారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. మదీనా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 42 మంది భారతీయులు మరణించడం హృదయ విదారకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ వాసులు కావడం బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "సౌదీలో జరిగిన ప్రమాదం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రార్థనలు ఉంటాయి" అని జగన్ పోస్ట్ చేశారు. అదేవిధంగా మంత్రి నారా లోకేశ్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని, మృతదేహాలను గౌరవప్రదంగా స్వదేశానికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని షర్మిల కోరారు. సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణ వాసులు మరణించడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న బస్సు, అగ్ని ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న 45 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సంబంధిత చర్యలు చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేయాలని కేసీఆర్ కోరారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సౌదీ అరేబియా లో జరిగిన ఘోర బస్సు ప్రమాదం హైదరాబాద్ కు చెందిన ఉమ్రా యాత్రికుల మృతి పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల్లో హైదరాబాద్ వాసులు ఉన్నారని సమాచారం తెలుసుకొని సౌదీ అరేబియా లో ఉన్న ఎన్నారై కాంగ్రెస్ నేతలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. మృతులకు ప్రగడ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు డిప్యూటీ సీఎం సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. సౌదీ అరేబియాలో యాత్రికులను తీసుకెళ్తున్న బస్సు దగ్ధమై పలువురు భారతీయులు మరణించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మక్కా చేరేందుకు బయలుదేరిన భక్తులు ఇంత భయానక ప్రమాదానికి గురవడం కలచివేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మృతుల్లో తెలంగాణకు చెందిన వారు ఉన్నారన్న సమాచారం మరింత విషాదకరమని తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ బస్సు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఉమ్రా యాత్రికులు మరణించడంపై మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంతాపాలు తెలిపారు.

# 'స్థానిక'లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (మలక్‌పేట), నవంబరు 17, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజ ర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ దిల్‌షుక్‌నగర్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నీలం వెంకటేష్, యువజన విభాగం రాష్ట్ర అధ్య క్షులు జిల్లా పల్లి అంజి, పల్ల గొర్ల మోడీ రాందేవ్ యాదవుల ఆధ్వర్యంలో వందలాదిమంది బీసీ విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మాట మార్చి పార్టీ పరంగా ఇస్తామంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, అదేవిధంగా రాజ్యాంగ సవరణ కోసం మద్దతు ఇవ్వాలని కోరారు.



# సానుభూతి, మద్దతు, మంత్రి పదవి వల్ల కాంగ్రెస్ గెలుపు

## జూబ్లీహిల్స్ ఫలితాలపై బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 17:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కేవలం ఆ పార్టీ బలంతోనే సాధ్యం కాలేదని, అక్కడ ప్రత్యేక పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడానికి అనేక కారణాలు దోహదపడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవీన్ యాదవ్ పట్ల సానుభూతి, మజ్లిస్ పార్టీ మద్దతు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి సుమారు రూ.300 కోట్ల వరకు ఖర్చు చేయడం, అజారుద్దీన్‌కు మంత్రి పదవి వంటి కారణాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలు విస్మరించారని భావించరాదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా తమ పార్టీ బలపడుతోందని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపు లేదా ఓటమి అనేది పార్టీలోని ప్రతి ఒక్కరి సమష్టి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన గణాంకాలను వెంటనే పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని ఆయన కోరారు. ఈ విషయంపై అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేస్తామని ఆయన అన్నారు. దేశంలో ఒకే దేశం ఒకే చట్టం ఒకే న్యాయం ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత నిర్వహణ చాలాముఖ్యం

## జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



అధికారులతో మాట్లాడుతున్న జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), నవంబరు 17, ప్రభాతవార్త :** అధికారులు, సిబ్బందికి రోడ్డు ట్రాఫిక్ భద్రత, రైలు కార్యకలాపాలలో భద్రతకై అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ప్రోటోకాల్‌లను ఖచ్చితంగా పాటించాలని జీఎం సంజయ్ కుమార్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో భద్రత, ట్రాఫిక్ సౌకర్యాల పనులపై జీఎం వివరణాత్మక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంత కల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై మాట్లాడుతూ రోడ్డు ట్రాఫిక్ సురక్షితంగా ప్రయాణిం చడానికి రైలు కార్యకలాపాలలో ఇంటర్‌లాకింగ్ లేని అన్ని గేట్ల వద్ద భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించడం చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. జోన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ గేట్ల స్థానం గురించి అధికారులు జనరల్ మేనేజర్‌కు వివరించారు. నాన్‌ఇంటర్ లాకింగ్ గేట్లను ఇంటర్‌లాకింగ్ లెవల్ క్రాసింగ్ గేట్లుగా మార్చ డంపై కార్యాచరణ ప్రణాళికను జనరల్ మేనేజర్ సమీక్షించారు. రోడ్డు, రైలు వినియోగదారుల భద్రతను బలోపేతం చేయ డానికి ఆర్‌యూబిలు, ఆర్‌ఓబిల వద్ద కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్ శీతాకాలంపై సమీక్షించారు. రైల్ల ఆక్ర మిత లైన్లకు వ్యతిరేకంగా సెట్ చేయబడిన పాయింట్‌ను గుర్తించ డానికి స్టేషన్లలో భద్రతా అలారాలను ఏర్పాటు చేయ డంపై కూడా ఆయన చర్చించారు. రైల్ల సమయపాలన కొనసాగించ డానికి కేబుల్ డామేజ్లను గుర్తించి వాటిని వెంటనే సరిచేయాలని ఆయన అధికారులను ఆదేశిం చారు. అనంతరం సంజయ్ కుమార్ శ్రీవా స్తవ జోన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ సౌకర్యాల పనులు, యార్డ్ రీమోల్డింగ్ పనుల పురోగతిని సమీక్షించి వివిధ పనులను వేగవంతం చేయాలని ఆయన డి.ఆర్.ఎం లను ఆదేశించారు. గతి శక్తి కార్గో టెర్మినల్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షిస్తూ వాటిని షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నిర్ణయించాలని సూచించారు.

# నేటి నుండి పత్తి కొనుగోళ్లు చేయాలి

## జౌళి శాఖ అధికారులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ఈ నెల 18 నుండి యదావిధిగా నిర్వహించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు జిన్నింగ్ మిల్లులకు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి సీసీఐతో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం విధించిన నిబంధనలను సడలించాలని సూచించారు. కేంద్ర జౌళిశాఖ అధికారులతో సోమవారం హైదరాబాద్‌తో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేమ శాతం మరియు ఎకరానికి విధించిన కొను గోలు పరిమితులపై సమీక్షిం చాల్సిందిగా కేంద్రానికి సూచించారు. కేంద్రం పెట్టిన నిబంధనలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడు తోందన్నారు. ఇంతకు ముందు పెసళ్లు, కందులు, పొద్దు తిరుగుడ వంటికి 25 శాతం పరిమితి పెట్టడంతో మిగిలిన వాటిని తక్కువ ధరకు అమ్ముకోవల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుడదనే ఉద్దేశంతో రాష్ట్రమే మద్ధతు ధర చెల్లించి, గత రెండు సంవత్సరాల నుండి మిగిలిన పంటలను కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. పత్తి దిగుబడి గణాంకాలను సీసీఐకి పంపినట్లు పేర్కొన్నారు. తేమశాతం నిబంధనతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జిన్నింగ్ మిల్లుల విభజనతో పత్తి కొనుగోళ్ల జరపాలనే నిర్ణయంపై మొదటి నుంచి తీవ్రఅసంతృప్తితో జిన్నింగ్ మిల్లుల ఉన్నాయని చెప్పారు. కొనుగోళ్ళు ఆరంభమై నెల రోజులు గడిచినప్పటికి, ఇప్పటికి కేవలం 243 మిల్లులు మాత్రమే రైతులకు కేటా యించడం, తద్వారా మిగతా 82 మిల్లులు ఇంకా తెరుచుకోకపోవడం, దీంతో రైతులు చాలా దూరం వెళ్లి పత్తిని అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.



# నకిలీ బ్యాంకుతో అమాయకులకు టోకరా

## హైదరాబాద్‌లో అల్‌ఫలా వర్సిటీ ఛైర్మన్ సోదరుడి అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో నిందితులకు ఆశ్రయం ఇచ్చిన హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావెద్ సిద్ధిఖీ సోదరుడు హమూద్ అహ్మద్ సిద్ధిఖీని మధ్యప్రదేశ్ పోలీసులు నకిలీ బ్యాంకుతో అమాయకుల ను టోకరా వేసిన కేసులో అరెస్టు చేశారు. 25 ఏళ్ల క్రితం ఈ గోల్‌మాల్ వెలుగు చూడగా దీనిపై అప్పట్లో నమోదైన కేసులో ఇతను వాంటెడ్ నేరగాడు. ఇంతకాలం పరారీలో వున్న ఇతను ఢిల్లీ కారు బాంబు దాడి తరువాత అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావెద్ సిద్ధిఖీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతగాడి సోదరుడి భాగోతం రట్టయ్యింది. దీంతో ఢిల్లీ పోలీసుల సమాచారం మేరకు మధ్యప్రదేశ్ పోలీసులు సోమవారం హమూద్ అహ్మద్ సిద్ధిఖీని నగరంలో అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే మధ్యప్రదేశ్‌లోని మహూ ప్రాంతంలో 2000 సంవత్సరంలో హమూ ద్ అహ్మద్ సిద్ధిఖీ ఓ నకిలీ బ్యాంకును స్థాపించి అధిక వడ్డీ పేరుతో అమాయకుల నుంచి 50 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశాడు. దీనిపై కేసు నమోదవగా హమూద్ అహ్మద్ సిద్ధిఖీ కుటుంబంతో సహా పారిపోయి హైదరాబాద్‌కు మకాం మార్చి వేరే పేరుతో ఇక్కడ సా ధారణ వ్యక్తిగా వుంటూ షేర్ మార్కెటింగ్ చేయసాగాడు. మరోవైపు హమూద్ అహ్మద్ సిద్ధిఖీ కోసం మధ్యప్రదేశ్ పోలీసులు 25 ఏళ్లుగా గాలిస్తున్నా ఆచూకీ లభించక పోవడం తో ఈ కేసును పెండింగ్‌లో వుంచారు. కాగా ఢిల్లీ పేలుడు తరువాత అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా వున్న జావెద్ సిద్ధిఖీ పాత్రపై ఢిల్లీ, జ మ్మూ కాశ్మీర్, హరియాణా పోలీసులు విచారణ చేబట్టగా ఇతగాడిపై వున్న కేసులు ఇతని సోదరుడు హమూద్ అహ్మద్ సి ద్దిఖీపై వున్న కేసుల సంగతి వెలుగు చూసింది.

దీంతో హమూద్ అహ్మద్ సిద్ధిఖీ గురించి ఢిల్లీ పోలీసులు మధ్యప్రదేశ్ పోలీసులకు సమాచారం అం దించగా వారు వెంటనే విమానంలో హైదరాబాద్‌కు వచ్చి ఇతన్ని అరెస్టు చేసి తమ వెంట తీసుకుపోయారు.

# సిబిఐ అధికారుల పేరిట బెంగళూరులో వృద్ధురాలికి సైబర్ నేరగాళ్ల టోకరా

## డిజిటల్ అరెస్టుతో బెదరించి ఆరు నెలలపాటు రూ.32 కోట్లు కాజేసిన వైనం

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టు మోసాలు ఆగడం లేదు. డిజిటల్ అరెస్టులు లేవని, వుండబోవని ఓవైపు పోలీసులు పదే పదే చెబుతున్నా మోసపోతున్న వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. తాజాగా బెంగళూరు నగరంలో ఇదే తరహాలో సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధురాలిని ఏకంగా ఆరు నెలల పాటు బెదిరించి 32 కోట్ల రూపాయలను కాజేశారు. బెంగళూరులో నివసించే ఓ వృద్ధురాలికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఆరు నెలల క్రితం ఫోన్ వచ్చింది. తాము డిహెచ్‌ఎల్ ఎగ్జిక్యూటివ్ విభాగం అధికారులమని తెలిపారు. మీకు మూడు క్రెడిట్ కార్డు లు, నాలుగు పాస్‌పోర్టులు, నిషిద్ధ ఎండిఎంఎ డ్రగ్స్‌తో కూడిన పార్శిల్ వచ్చి ందని తెలిపారు. అయితే దీంతో తనకు సంబంధం లేదని ఆమె చె ప్పగా వారు తీవ్రంగా స్పందించారు. మీకు వచ్చిన పార్శిల్ సిబిఐ విభాగంతో లింకు అయ్యిందని, త్వరలో మీకు సిబిఐ నుంచి ఫోన్ వస్తుందని బెదిరించారు. దీని తరువాత వృద్ధురాలికి మరో ఫోన్ వచ్చింది. తాము సిబిఐ అధి కారులమని, డిజిటల్ అరెస్టు చేస్తున్నామని బెదిరించారు. దీని నుంచి తప్పించుకోవాలంటే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలకు 32 కోట్ల రూపాయలు పంపాలని హెచ్చరించారు. దీంతో బెదిరిపోయిన ఆ మహిళ నిందితులు చెప్పినట్లుగా 187 బ్యాంకు ఖాతాలకు విడతలవారీగా ఆరు నెలల వ్యవధి లో 32 కోట్ల రూపా యలను దోచుకున్నారు. దీని తరువాత ఆమెకు నకిలీ క్లియరెన్స్ సర్టిఫికేట్ కూడా పంపి మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో వృద్ధురాలికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నేరం వెలుగు చూసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

తొర్రూర్‌లో తొలిరోజున

# 59 ప్లాట్ల విక్రయాల ద్వారా రూ. 46 కోట్ల ఆదాయం

## నేడు మరో 104 ప్లాట్లకు బహిరంగ వేలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 17:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలకు మరోసారి మంచి స్పంద న వచ్చింది. నగర శివారు ఓఆర్ఆర్‌కు సమీపంలోని తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి, ప్రాంతాలోని 163 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ బహిరంగ వేలంలో తొలి రోజున తొర్రూర్‌లోని 59 ప్లాట్లకు వేలం నిర్వహించారు. ఈ విక్రయాల్లో అత్యధికంగా చదరపు గజానికి రూ.39 వేల ధర పలికింది. మొత్తం మీద ఈ ప్రాంతంలో చదరపు గజానికి సగటున రూ. 28,700 ధర పలికింది. ఇక్కడి భూములకు కనీస ధర రూ.25 వేలు గా నిర్ధారించి వేలం నిర్వహించారు. సోమవారం నాటి విక్రయాల ద్వారా మొత్తం రూ.46 కోట్ల మేర ఆదాయం వచ్చిందని స్వగృహ కార్పొరేషన్ ఎండి వి. పి. గౌతమ్ తెలిపారు. ఈ వేలం పాటలో 110మంది బిడ్డర్లు పాల్గొన్నారన్నారు. తొర్రూర్ ప్రాంతం లోని మిగిలిన 65 ప్లాట్లకు, కుర్మల్ గూడ లోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లి లోని 13 ప్లాట్లకు మంగళవారం నాడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ధనుష్ శ్రీకాంత్‌ను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 17:** జపాన్‌లో జరుగుతున్న డెఫ్లింపిక్స్ (బధిర) స్పోర్ట్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేశ కీర్తిని చాటిన హైదరాబాద్ షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదని ధనుష్ నిరూపించి యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. స్వర్ణ పతకం సాధించడమే కాకుండా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించిన ధనుష్ శ్రీకాంత్, భవిష్యత్తులో మరిన్ని రికార్డులను సాధించాలని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని చెప్పారు. టోక్యోలో ఆదివారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో ధనుష్ శ్రీకాంత్ 252.2తో ప్రపంచ రికార్డు స్కోరు చేసి బంగారు పతకం దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన ముర్తజా వానియా 250.1 స్కోరుతో రజతం పతకం గెలుచుకన్నాడు. రాష్ట్రంలో అమలవుతున్న క్రీడా విధానం ప్రకారం డెఫ్లింక్స్‌లో స్వర్ణం అందుకున్న శ్రీకాంత్‌కు రూ. 1.20 కోట్లు ప్రోత్సా హక బహుమతి కింద ఇవ్వనున్నట్టు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించిన విషయం తెలిసిందే.

# శ్రీవారి సేవలో విశ్వేశ్వరప్రసన్నతీర్థస్వామి

**తిరుమల, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** కార్తీకమాసం చివరి సోమవారం ఉదయం ఉడిపి ఫెజావర్‌మఠం పీఠాధిపతి విశ్వేశ్వరప్రసన్న తీర్థస్వామి శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేశారు. స్వామివారికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయ మర్యాదలతో మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. స్వామి ఆలయం లోపలకు చేరుకుని తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించు కున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

అందరూ నిన్ను అవమానిస్తున్నప్పుడు వినయంగా ఉండడం మంచిది కాదు. కాని అందరూ నిన్ను ప్రశంసిస్తున్నప్పుడు వినయంగా ఉండడం మాత్రం చాలా అరుదైన విషయం.

-సెయింట్ బెర్నార్డ్

# పైరసీ 'బొమ్మ' లాటకు తెరపడింది !

సజావుగా సాగుతున్న సినీ వినోద వ్యాపారాన్ని అమాంతం మింగేసి సినీ జీవులకు బతుకు తెరువు లేకుండా చేయడమూ సమాజ విద్రోహంగానే భావించాలి. ఇప్పుడదే జరిగింది. ఓ చిన్న ముఠా అంతర్జాతీయ మోసానికి పాల్పడి పైరసీ భూతాన్ని సమాజం మీదకు వదిలిపెడితే దానికి బాలీవుడ్, హాలీవుడ్, టాలీవుడ్ సైతం చిత్రసీమ యావత్తూ 37 వేల కోట్లు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ భూతాన్ని ఎలాఎదుర్కోవాలో తెలియక గత కొన్ని సంవత్సరాలుగా చిత్రసీమ విలవిల్లాడింది. ఇలా పైరసీని ప్రైవసీ దారిలో నడిపించి దాదాపు 20 కోట్లు గడించిన దొంగ పోలీసులకు దొరికిపోయాడు. ఎన్ని కోట్లు ఆర్జించినా ఆ నిందితుడు ఇప్పుడు కటకటాల్లో ఊచలు లెక్కించక తప్ప లేదు. విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి పోలీసుల చేత చిక్కాడు. తనకున్న సర్వర్ల ద్వారా 21వేల సినిమాలలో ఎవరికీ తెలియనీకుండా హ్యాకింగ్ చేయగలిగాడంటే జనం నివ్వెరపోయారు. ఎట్టకేలకు ఐబొమ్మ పైరసీకి తెరపడింది. అతి చిన్న వయసులోనే సినీ డిజిటల్ నేర సామ్రాజ్యాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకుని బొమ్మలాట ఆడించిన నింది తుడు చేతికి చిక్కాక సినీ నిర్మాతలు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. తన నెట్వర్క్‌తో కొత్త సినిమా విడుదలైన కొన్నిగంటల్లోనే పైరసీ జరిగిపోతుంది. తాను సొంతంగా ఒక్క సినిమాను కూడా హ్యాక్‌చేయలేదు. రికార్డు చేయ లేదు. మూవీ రూల్జ్, తమిళ్ వన్ సహా మరికొన్నిపైరసీ వెబ్‌సైట్‌ల నుంచి అప్‌లోడ్ అయిన సినిమాలనే హెచ్‌డి వెర్షన్‌లోకి రికార్డు చేసి నిమిషాల్లోనే సినీ ప్రేక్షకులకు అందించేవాడు. ఇవన్నీ రెండో కంటికి తెలియడనుకోవ డంలోనే దొరికిపోయాడు. ఎంత తెలివైన నేరస్థుడేనా ఎక్కడో చిన్నతప్పుతో దొరికిపోతాడనుకునే దానికి ఇదే నిదర్శనం. అందుకేనేమో 'దమ్ముంటే నన్నుపట్టుకోండి!?' అని పోలీసులకే సవాల్ విసిరాడు. కానీ ఓ బెట్టింగ్ యాప్ చేసిన చెల్లింపులు ఈతడిని పట్టేశాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తన ఫ్లాట్లో ఉండగా పైరసీ మాస్టర్‌మైండ్ రవిని పోలీసులు అరెస్ట్ చేశారు. 35 బ్యాంకు ఖాతాల్లోని రూ.3కోట్ల రూపాయలను ఫ్రీజ్ చేశారు. ఎన్నో హార్డ్ డిస్కు, కంప్యూటర్లు, పైరసీ కేసెట్లు స్వాధీ నం చేసుకున్నారు. ఒంటరిగా కరేబియన్ దీవులలో నివసిస్తూ ఐ.బొమ్మకు అనుబంధంగా చాలా ప్రాక్సీ వెబ్సైట్లకు అనుసంధానం చేసి ఉచితంగా కొత్త సినిమాలు చూపించేవాడు. అలా నెమ్మదిగా వారి దృష్టిని బెట్టింగ్ యాప్‌ల వైపు మళ్లించడం అతని హాబీ. ఒక్క తెలుగు చిత్రసీమకే సాలీనా దాదాపు 27వేల కోట్ల మేరకు నష్టం కలిగించిన ఈ పైరసీ వ్యవహారంలో ఎవరికీ దొరక్కుండా ఐపి నంబర్లు, అవి ఉన్న లొకేషన్స్‌ను మార్చి చూపడంలో అతనికి ఉన్న మేధాశక్తి అపూర్వం. అందుకే ఆరు నెలల పాటు సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టుబడ కుండా దాక్కోగలిగాడు. నెలకు కనీసం 35 లక్షల మందికి పైగా ఐబొమ్మ వెబ్సైట్ ద్వారా కొత్త సినిమాలు వీక్షిస్తుంటారు. అతని నెట్వర్క్‌కు అతనే బాస్ అయినందున వెంటనే పట్టుకోలేకపోయారు. సినిమా విడుదలైన గంటల వ్యవధిలోనే పైరసీ కాపీని బయటకు వచ్చేసేది. అందుకు తగిన ఏర్పాట్లు, తమిళనాడులోని ఇద్దరి ద్వారా కథ నడిపించేవాడు. ఈ నేపథ్యంలో సినీ పరిశ్రమ పెద్దల ఫిర్యాదుతో పోలీసులు 89 వెబ్సైట్లపై కేసు నమోదు చేశారు. ఇంతకు ముందు థియేటర్లలో సినిమాలు రికార్డు చేస్తూ సర్వర్లను హ్యాక్ చేస్తున్న ఐదుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఐబొమ్మ నెట్వర్క్ దేశవ్యాప్తంగా ఉన్నదని, గతంలో బీహార్, ఉత్తరప్రదేశ్ ఐబొమ్మ ఏజెంట్లను అరెస్ట్ చేశారు. ఐబొమ్మలో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా కూడా రవి కోట్లాది రూపాయలు సంపాదించినట్టు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్స్ కేసు దర్యాప్తులోకొన్ని అకౌంట్స్ వివరాలలో ఐబొమ్మతో జరిపిన లావాదేవీలు బయటపడ్డాయి. వీటి ఆధారంగా పోలీసులకు కూపీ లాగగా ఐబొమ్మ గుట్టురట్టయింది. అతనికి ఐబొమ్మ, బప్పమ్, ఐవిన్ టీవీల పేర్లతో పైరసీకి పాల్పడుతుంటాయి. కరీబియన్ దీవుల్లోని సెయింట్ నేవీ దేశపు పౌరసత్వం ఉంది. ఆ దేశమే ఈ వ్యవహారాన్ని నడపడంతో తన్నెవరూ కనిపెట్టలేరని అనుకుని ఉంటాడు. అశ్వినీ కుమార్, కిరణ్ కుమార్ వంటి హ్యాకర్లకు తనకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు ఇచ్చిన సొమ్ము నుంచి సినిమాకు 30వేలనుంచి లక్ష రూపాయల వరకు చెల్లించేవాడు. హ్యాక్ అయిన కంటెంట్‌ను నిమిషాల వ్యవధిలోనే తన వెబ్సైట్లకు అప్లోడ్ చేయగలగడం అతని నైపుణ్యం. అయితే సినీవర్గాలు తమ సినిమా పైరసీ కాకుండా హైలెవల్ సెక్యూరిటీ కోసం డిజిటల్ సర్వర్లలో భద్రపర్చుకుంటారు. కానీ ఆసర్వర్లను కూడా హాక్ చేయగల సత్తాఉంది. రవి కూడా ఒక సర్వర్నే నమ్ముకోకుండా మరో పది సర్వర్‌లను ముందు జాగ్రత్తగా నిర్వహించేవాడు. ఒకవేళ ఐబొమ్మ మూతపడితే ప్రత్యామ్నాయంగా వాడుకునేందు కు మరో 65 మిర్రర్ వెబ్సైట్లను సిద్ధం చేసుకున్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తే దొంగ ఎప్పటికైనా దొరికిపోతాడన్న వాస్తవం తెలుపుతోంది. దేశంలో ఇతరప్రాంతాల్లో కూడాఇలాంటి పైరసీ కార్యకలాపాలు ఉన్నాయి. వాటిని కూడా సమూలంగా నాశనం చేస్తే తప్ప పరిశ్రమ బతకదు. రవిని ఆరాతీయగా తనవద్దనున్న 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్‌ల డాటాని కూడా డార్క్ వెబ్‌సైట్‌లకు అమ్ముకున్నట్లు పోలీసులు కనుగొన్నారు. అయితేఅలాంటి సమాచారం చేరకూడదని వారికి చేరితే నష్టం కలుగుతుందని, పైరసీ సినిమాలకు దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరికలను గమనంలోకి తీసుకోవాల్సిందే!

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.



వినోబా భావే

కష్టానికీ, సుఖానికీ మూలం భావన, భావనకి మూలం మనస్సు. కనుక మనస్సును నియంత్రించుకోవాలి.



వివేకానందుడు

# దేశ రాజకీయాలకు బీహార్ ఎన్నికలు దిక్సూచి?

**కాంగ్రెసు ముఖ్యనాయకత్వం ఇంకా భావిలో కప్ప మాదిరే ఆలోచన చేస్తే కుదరదేమో! ఏదో ఒక రోజున అసలు సిసలైన నాయకత్వానికి ఆ పార్టీ పగ్గాలు ఇస్తేనే, మరొక ఎన్నికలలో అధికారం మీద ఆశలు పెట్టుకోటానికి అవకాశం లభిస్తుందా! కాదని, అర్బన్ నాయకత్వాన్ని వదలకుండా ఉంటే అంతే సంగతులు అని ప్రజలు అన్నా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. తెలంగాణ విషయంలో కాంగ్రెసు-రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కొన్నాళ్లైనా బలహీనపర్చకుండా ఉంటేనే, పార్టీకి మనుగడ ఉంటుంది. అంతేకాని కాంగ్రెసులో కుమ్ములాటలు జన్మహక్కుగా భావిస్తే ఓటమి కూడా వారి జన్మహక్కు అవుతుంది. మనదేశ రాజకీయాలు వైవిధ్యభరితంగా ఉన్నా ఇంతవరకూ ప్రజలు ఇష్టమైన పార్టీలనే ఓట్ల ద్వారా పాలనకు అర్హుల్ని చేస్తున్నారు. ఆ విషయంలో మాత్రం ఏకత్వం ప్రతిబింబిస్తున్నది.**



రావులపాటి సీతారాంరావు

ఇన్నటి బీహార్ అసెంబ్లీ ఎన్నికలను విశ్లేషిస్తే కొన్ని వాస్తవాలు గమనంలోకి తీసుకోక తప్పదు. సానుకూల విషయం ఏమిటంటే ఓటర్లు సుస్థిరంగా ఉండే ప్రభుత్వానికే పట్టం కట్టారు. కేంద్రంలో కానీ, రాష్ట్రాలలో కానీ ఏకపక్ష పాలన అంటే ఒకే పార్టీ అధికారంలోకి రావటం ఇప్పట్లో జరిగేపని కాదని తేలిపోయింది. కూటముల ప్రభుత్వాలు, రాష్ట్రాలలో కేంద్రంలో రాజ్యం ఏలక తప్పదని ఈ దేశ ఓటర్లు తీర్పు ఇచ్చారు. మినహాయింపులు ఇక్కడో, అక్కడో (తెలంగాణ అనుకున్నా సిపిఐ, ఎఐయంయం-ఓవైసీ పార్టీలు కాంగ్రెస్‌కు బై ఎలక్షన్‌లో మద్దతు పలికాయి) ఉన్నాయి కానీ కొట్టొచ్చేట్లు గమనించదగ్గ పరిణామాలు కానేకావు. మోడీ అప్రతిహతంగా ప్రధానమంత్రిగానే కాకుండా రాజకీయ నాయకుడిగా తన ప్రభావాన్ని అత్యంత ప్రతిభావంతంగా (దక్షిణాది రాష్ట్రాలలో కాదు) ఎన్నికలలో చూపిస్తున్నారు. అది సుస్థిర పాలనకు ఒక సానుకూల అంశంగా లెక్కలోకి తీసుకోవచ్చు. ఓటర్లు ప్రలోభాలకు లొంగినట్లు బయటకు కనపడ్డా, ఓటింగ్ విషయంలో మాత్రం తామునచ్చిన, మెచ్చిన పార్టీకో కూటమికో, గంపగుత్తగా సహాయసహకారాలు అందిస్తున్నారు. ఇది ఒక సానుకూల పరిణామంగా ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టాన్ని నిలబెట్టేదిగా చెప్పుకోవచ్చు. అయితే ఏకాభిప్రాయం దేశంలో పార్టీల మధ్య అనేక సమస్యల్లో కుదరక పోవచ్చు కానీ, ఇతర దేశాలతో మన దేశం కారణాంతరాల వల్ల సఖ్యత సాధించటంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పుడు ప్రతిపక్షాలు తమ వంతు సహాయ సహకారాలు అందించటం తప్పనిసరి. గత కాలంలో అలాంటి సఖ్యత రాజకీయ పార్టీలలో కనపడేది. ప్రస్తుతం ఆ ముఖ్యమైన అవగాహన కానరావటం లేదు. పైగా అధికారం అనేది తమ పార్టీకే ఎల్లకాలం ఉండాలనే ఆలోచన ప్రతిపార్టీలోనూ బలంగా కనపడుతున్నది. ఇతర దేశాల ప్రభుత్వాలు మన దేశాన్ని కించపరుస్తున్న సంఘటనల్లో కూడా అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలు ఏకాభిప్రాయ దృక్పథం కనపర్చటం లేదు. ఇలాంటి దిగ్భ్రాంతికర పరిణామం ప్రజలకూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా మంచిదికాదు. అధికారంలోకి రావాలని ప్రతిపార్టీ కోరుకోవటంలో తప్పు లేదు కానీ, ఎల్లకాలమూ తమ పార్టీయే అధికారంలో ఉండాలి, అందుకోసం ఎంతకైనా తెగిస్తాం, దేశం నష్టపోయినా సరే అదే పద్ధతిని పాటిస్తాం అని అధికారంలో ఉన్న పార్టీలు అనుకుంటే ప్రజాస్వామ్యం మూణ్ణాళ్ల ముచ్చటే అవుతుంది. పాకిస్థాన్ దేశం పడుతున్న అవస్థలు చూస్తూనే ఉన్నాం. పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక లాంటివి పాలనను సాగించలేక, కుదురైన ప్రజాస్వామ్య పద్ధతులను అవలంబించలేక సతమతమవుతున్నాయి. మనదేశంలో ఏమాత్రం ఆ విధమైన దురదృష్ట మార్పులకు చోటిస్తే గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, ఆజాద్ లాంటి గొప్పనాయకులు స్వాతంత్ర సముపార్జన తర్వాత లౌకిక పాలనకు కన్న



కలలు కల్లలుగా మిగిలి పోయే ప్రమాదం ఉంది. అందుకే ఆ ప్రమాదం రాకముందే విజ్ఞతతో, హేతుబద్ధ ఆలోచనతో, విభిన్న దృక్పథాలు పార్టీలపరంగా ప్రతిబింబించినా, ప్రజాస్వామ్య పరధుల్లోనే, నియంతృత్వ పోకడలను అధిగమించి అన్నిపార్టీలు, ప్రజల సహకారంతో దేశాభివృద్ధికి సుస్థిరత్వానికి బాటలు వేసినప్పుడు భారత్ తన ప్రత్యేకతను అంతర్జాతీయంగాకోల్పోదు. అస్థిరతకు తావివ్వని పరిస్థితులను అధికారపార్టీ కల్పించక తప్పదు. ఒకటికి పదిసార్లు, అన్ని పార్టీలను ముఖ్యమైన విషయాలలో కలుపుకొని పోయేందుకు ప్రయత్నించక తప్పదు. మన రాజ్యాంగంలో 'సెక్యులర్' అన్న పదం ప్రత్యేకంగా చేర్చటానికి మనసా వాచా ఆ సిద్ధాంతాన్ని మన ప్రజలూ, నాయకులూనమ్మినందువల్లనే, అన్ని ధర్మాలనూ, మతాలనూ సిద్ధాంతాలనూ, గౌరవిస్తూనే, ఏక త్రాటిపై దేశాన్ని నడిపించేందుకు మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా కొన్ని నిర్దిష్టమైన మౌలిక సూత్రాలను చట్టాల లో, ప్రకరణలలో పొందుపర్చటం జరిగింది. తు.చ తప్ప కుండా ప్రజల కోసం ప్రజాస్వామ్య పద్ధతులు పరిఢవిల్లటానికి, వాటిని అమలుపర్చాల్సిన నైతిక బాధ్యత ప్రజా ప్రతి నిధులూ, పార్టీలపై ఉన్న విషయాల్ని ప్రక్కకు నెట్టేసి, మా యిష్టమొచ్చిన రీతిలో పాలన సాగిస్తాం అని అను కుంటే పొరుగు రాజ్యాల పరిస్థితే మనకు సంభవించవచ్చు. బీహార్ ఎన్నికలు, ఎంతవరకు కరెక్టో కాని, కుల ప్రాబల్యా నికి ఈసారి పెద్దపీట వేసినట్లులేదు. లాలూ ప్రసాద్ లాంటి వారు గణనీయంగా ఓట్లు సాధించినా, కుల పరంగా సీట్లు తెచ్చుకోవటంలో విఫలమయ్యారు. కాంగ్రెసు పార్టీ పెద్ద రికాన్నికాదని, ముఖ్యమంత్రి పదవి తమకే కావాలని పట్టు పట్టిన తేజస్వీ యాదవ్ చివరకు ప్రజల మెప్పును పొందలేక తోడబుట్టిన వారిని కూడా దూరం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో కానీ, ఆంధ్రప్రదేశ్‌లో కానీ, చివరకు బీహార్‌లో కూడా తోబుట్టువులు (ఆడపిల్లలు) విలపిస్తూతమ సొంత కుటుంబాన్ని కాదనే పరిస్థితి ఏర్పడిందంటే అధికార వ్యామోహం కుటుంబాలను ఎంతగా క్షుద్ర రాజకీయాలకు బలి చేస్తుందో ఈ ఉదాహరణలు చెప్పకనే చెబుతున్నాయి. పరిపాలనా దక్షత అవసరమని బీహార్,ఎ.పి ఎన్నికలు నిరూపిస్తున్నాయి. కాంగ్రెస్ ముఖ్యమైన పార్టీగా ఉన్న మహా ఘట్ బంధన్‌కూ, ఎన్.డిఏ కూటమికి నాయకత్వ విధానాన్ని నిర్ణయించుకోవటంలో స్పష్టత ఓటర్లు గమనించి ఓట్లు వేస్తున్నారు. ఎపిలో కూటమిలోని ప్రధాన నాయకుడు చంద్రబాబు నాయుడు అంటే బిజెపిలోని నాయకులలోని కొందరికి గిట్టకపోయినా ఆయనకే పగ్గాలు ఇవ్వక తప్పలేదు. ప్రజాభిప్రాయాన్ని ఆవిధంగా గౌరవించక తప్పలేదు. బీహార్ లోనూ నితీష్‌కుమార్ పరిపాలనాదక్షతను, బిజెపికి ఎన్నికల లోసీట్లు ఎక్కువ సాధించినా, కాదనలేని పరిస్థితి. సి.యం పదవి ఆయనకే కట్టబెట్టక తప్పలేదు. కాంగ్రెసు ముఖ్యనాయకత్వంఇంకా భావిలో కప్పమాదిరే ఆలోచనచేస్తే కుదరదేమో! ఏదో ఒక రోజున అసలు సిసలైన నాయకత్వానికి ఆ పార్టీ పగ్గాలు ఇస్తేనే, మరొక ఎన్నికలలో అధికారం మీద ఆశలు పెట్టుకోటానికి అవకాశం లభిస్తుందా! కాదని, అర్బన్ నాయకత్వాన్ని వదలకుండా ఉంటే అంతే సంగతులు అని ప్రజలు అన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. తెలంగాణ విషయంలో కాంగ్రెసు- రేవంత్‌రెడ్డినాయ కత్వాన్ని కొన్నాళ్లైనా బలహీనపర్చకుండా ఉంటేనే, పార్టీకి మనుగడ ఉంటుంది. అంతేకాని కాంగ్రెసులో కుమ్ములాటలు జన్మహక్కుగాభావిస్తే ఓటమి కూడా వారి జన్మహక్కుఅవుతుంది. మన దేశ రాజకీయాలు వైవిధ్యభరితంగా ఉన్నా ఇంతవరకూ ప్రజలు ఇష్టమైన పార్టీలనే ఓట్ల ద్వారా పాలనకు అర్హుల్ని చేస్తున్నారు. ఆ విషయంలో మాత్రం ఏకత్వం ప్రతిబింబిస్తున్నది.

# భవిష్యత్తుపై సోషల్ మీడియా ప్రభావం ఎంత!

తరిగోపుల నారాయణస్వామి

సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రపంచంలో మనిషి జీవితంలో అనివార్య భాగంగా మారిపోయాయి. ఒకే క్షణంలో ప్రపంచం నలుమూలల నుంచి సమాచారాన్ని అందించగల ఈ వేదికలు వ్యక్తుల ఆలోచనలను, అభిరుచులను, జీవనశైలిని ప్రభావితం చేస్తున్నాయి. ప్రతి సంఘటన, ప్రతి అభిప్రాయం, ప్రతి స్పందన ఇప్పుడు ప్రజల ముందుకు వేగంగా చేరే పరిస్థితి నెలకొంది. సామాజిక మాధ్యమాలు వినియోగదారులకు అభ్యాసం, అవగాహన, సమాచార వినిమయానికి విస్తృతమైన అవకాశాన్ని కల్పిస్తున్నాయి. విద్యార్థులకు పాఠ్య సమాచారాన్ని తెలుసుకునే అవకాశాలు పెరగడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు, కొత్త నైపుణ్యాలపై అవగాహన కూడా పొందే వీలుంది. ఈ వేదికలు సృజనాత్మకతను ప్రపంచానికి చాటుకునేందుకు మంచి సాధనమయ్యాయి. మన సమాజంలో సామాజిక చైతన్యాన్ని పెంచడంలో కూడా ఈ మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివిధ సమస్యలపై ప్రజల్లో చర్చలు, స్పందనలు, పరిష్కారాలపై ఆలోచనలు ఉద్భవించడం సామాజిక మాధ్యమాల కారణంగానే సాధ్యమైంది. ఎన్నో సేవా కార్యక్రమాలు, రక్తదాన పిలుపులు, విపత్తు సమయంలో సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి. రోజువారీ వార్తలు, ప్రభుత్వ పథకాలు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని చాలా మంది మొబైల్‌లోనే తెలుసుకోవడం ఆలవాటైపోయింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఈ వేదికలు జ్ఞాన ద్వారాలను తెరిచి పెట్టాయి. ప్రపంచం చిన్నదై చేతిలోకి వచ్చేసిన సమాజం ఇది. అయితే ఈప్రయోజనాలతో పాటు అనేక అనర్థాలు కూడా పెరుగుతున్నాయి. అపోహలు, అసత్య ప్రచారాలు, వదంతులు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపించి సమాజంలో గందరగోళాన్నిసృష్టిస్తున్నాయి. నిజం, అబద్ధం మధ్య తేడా తెలియక చాలామంది తప్పుడు సమాచారాన్ని నమ్మేపరిస్థితి ఏర్పడుతోంది. అనవసర వాదోపవాదాలు, వ్యక్తిగత దూషణలు కూడా పెరుగుతూ మానవ సంబంధాల బలహీనతకు దారితీస్తున్నాయి. పిల్లలు, యువత చదువుపై దృష్టిని కోల్పోయి ఎక్కువ సమయం ఫోన్లలో గడపడం ఒక పెద్దసమస్యగా మారింది. మానసిక ఆరోగ్యం



పై కూడా ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గోప్యతకు సంబంధించిన సమస్యలు కూడా తీవ్రమవుతున్నాయి. వ్యక్తిగత వివరాలను అందరితో పంచుకోవడంవల్ల భద్రతా సమస్యలు తలెత్తే అవకాశాలు పెరుగుతున్నాయి. ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. సమయ వృథా అనేది సామాజిక మాధ్యమాల వల్ల ఉద్భవిస్తున్న మరో పెద్దసమస్య. రోజులో కొద్దిసేపు మాత్రమే ఉపయోగించాలని అనుకున్నవారు గంటల తరబడి అర్థరహిత స్క్రోలింగ్‌లో మునిగిపోతున్నారు. ఇదివారి పనితీరుపై, వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపుతోంది. ఈ మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఎలాంటి సమాచారాన్ని చూసినా వెంటనే నమ్మకుండా ధృవీకరించుకునే అలవాటు పెంపొందించుకోవాలి. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదు. గోప్యతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. పిల్లలు, యువత వినియోగాన్ని తల్లిదండ్రులు పర్యవేక్షించడం అత్యవసరం. చదువుకు, అభ్యాసానికి సహకరించే రీతిలో ఈ వేదికలను వినియోగించే అలవాటు పెంచాలి. సమయ పరిమితి పెట్టుకుని ఉపయోగించడం మంచిది. ప్రతికూల ప్రభావాలకు దూరంగా ఉండేలా అవగాహన పెంపొందించాలి. సరైన అవగాహనతో, సానుకూల దృష్టితో ఈ వేదికలను ఉపయోగించడం నేటి తరానికి అత్యంత అవసరం. సమాజానికి ఉపయోగపడే సమాచారం, సృజనాత్మక ఆలోచనలను పంచుకోవడం ద్వారా మనం ఈ మాధ్యమాలను సద్వినియోగం చేసుకో వచ్చు. ఈ వేదికలను ఉపయోగించే సమయంలో మన భావోద్వేగాలను, స్పందనలను నియంత్రించడం కూడా చాలా ముఖ్యం. కోపంతో, ఆవేశంతో, ఆలోచించకుండా ఇచ్చే స్పందనలు అనవసర సమస్యలకు దారితీస్తాయి. ప్రశాంతంగా, పరిశీలనతో వ్యవహరించడం మంచి అలవాటు. సామాజిక మాధ్యమాల్లో మన మాటలకు బాధ్యత ఉందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మనం పంచే ప్రతి సమాచారం మరెంతో మందిని ప్రభావితం చేయగలదు. కాబట్టి నిజాయితీ, నైతికత, సానుకూలతతో వ్యవహరించడం సమాజానికి మేలు చేస్తుంది. భవిష్యత్తులో సామాజిక మాధ్యమాలు మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల వాటి వినియోగంలో విజ్ఞానంతో, సంయమనంతో ఉంటేనే ప్రయోజనాలను పొందగలుగుతాం. సరికొత్త ప్రపంచంలో సరికొత్త ఆలోచనలకు ఇవి వేదికలు కావాలి.

# ప్రజావాక్కు



## బిఆర్‌ఎస్‌కు ఎదురు దెబ్బ!

తెలంగాణ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత అనివార్యమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసింది. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆఖండ మెజార్టీతో విజయంసాధించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి పెద్ద పరీక్షగా భావించారు. ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి, కాంగ్రెస్ అమలు చేస్తున్న 'ఆరు' గ్యారెంటీలకు ప్రజల నుంచి లభించిన ఆమోద ముద్రగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికైనా బీ.ఆర్.ఎస్ తమవైఫల్యాలను గుర్తించి, ప్రజలకు దగ్గరయ్యేలా, బలమైన ప్రజాసమస్యలపై పోరాడేలా తమవిధానాలను మార్చుకోకపోతే, 2028సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రాజకీయాల నుండి ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## నాణ్యత లోపిస్తున్న అల్పాహార భోజనం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే అల్పాహారం రెండు పూటలా భోజనానికి చెల్లించే ధర రూపాయల 72రూపాయలు. మెనూ అమలుచేయాలని ఉన్నా అమలు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోగులు ఈ ఆహారం అయిష్టంగా తింటున్నారు. ఉదయం అల్పాహారంలోఇడ్లీ, ఉప్మా, పాలు బ్రెడ్, కిచిడీ రోజువారికి అందించాలి. ఖచ్చితంగా భోజనంతో పాటు గుడ్డు ఉండాలి. అనంతరం పప్పు సాంబారు, పెరుగు లేదా మజ్జిగ ఇవ్వాలి, ఒక రోజుకి ఇచ్చే రూ.72గిట్టుబాటు కాకపోవడం వల్ల ఈ సమస్య వస్తుందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## సైనిక్ స్కూళ్ల సంఖ్య పెంచాలి

సైనిక్ స్కూల్‌లు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 2 చోట్ల ఉన్నాయి. అందులో ఒకటి వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో గిరిజన సైనిక్ స్కూల్ ఉంది. మరొకటి కరీంనగర్‌జిల్లాచొప్పదండి మండలంరుక్మా పూర్ లో షెడ్యూల్డ్ క్యాస్ట్ సైనిక్‌స్కూల్ ఉంది. ఇదే తరహాలో బాలికలకు, వెనుకబడిన తరగతులకు, మైనారిటీ వారికి ఒక్కొక్క సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- రాపాక రవీందర్, జనగాం

## సుప్రీం సూచనను సమర్థించాలి

సుప్రీంకోర్టు ఈ మధ్య హైకోర్టులకు కింద కోర్టులకు ఓ సూచన చేయడం జరిగింది. ఏమంటే కోర్టులలో కేసులు ఏ రోజు ఫైలు చేయడం జరిగింది, ఎన్నివాయిదాలు ఏకారణం చేత వేయబడింది, ఎప్పుడు ఎంతకాలనికి తుది తీర్పు యివ్వబడింది మొదలైన సమాచారం ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టుకు నివేదిక పంపాలని కోరింది. దీనివల్ల అనవసర కాలాయాపన ఎందుకయిందో తెలుస్తుంది. కోట్లకేసులు దశాబ్దాలుగా కోర్టుల్లో పేరుకుపోయాయి. అసలు చట్టంలోనే లా ఆఫ్ లిమిటేషన్ ఉన్న మాట మరుగున పడేశారు. అమెరికా వంటి దేశాలలో సివిల్, క్రిమినల్ కేసులు ఓ కాలపరిమితిలో పరిష్కారం అవుతాయట. చూద్దాం సుప్రీం చేసిన ఈ కొత్త సూచన ఎంత వరకు పాటిస్తారో. కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీం సూచనను సమర్థించాలి.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## ట్రంప్ సుంకం ప్రపంచ మార్కెట్లకు ఊరట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన కీలక నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. 200కు పైగా ఆహార ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ప్రపంచ మార్కెట్లకు తాత్కాలిక ఉపశమనం కలిగించే చర్యగా భావిస్తున్నారు. సుంకాల తగ్గింపు వల్ల అమెరికాలోకి వచ్చే ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గేఅవకాశం ఉంది. ఇదినేరుగా వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చడమే కాక, రీటైల్ రంగంలో పోటీని పెంచి, నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులోకిరావడానికి మార్గం సుగమం చేస్తుంది. ముఖ్య ఆహార విభాగాల్లో ఈ మార్పు కనిపించనుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పదివేలతోనే గెలుపు

బీహార్ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం ఎన్నికల ముందు మహిళల అకౌంట్లో పదివేల రూపాయలు వేయడం వలన జరిగిందని చెప్పవచ్చు. ఈ రోజుల్లో ఓటర్లు ప్రత్యక్షంగా డబ్బులు ఇస్తేనే ఓట్లు వేస్తున్నారు. పార్టీమీద అభిమానం కాదు. కాంగ్రెస్ మీద ద్వేషం అంతకన్నా కూడా కాదు. కాంగ్రెస్ ఇప్పుడు డబ్బులు ఇచ్చే స్థితిలో లేదు. ఓట్ చోరీ జరిగిందని, ప్రతి ముఖ్యమైన సీసీటీ పుటేజులను ఎలక్షన్ కమిషన్ దాచేసిందని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ ప్రజాస్వామ్యంలో సామాన్యుడు ఓటు ప్రభుత్వాధినేతలను నిర్దేశిస్తుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వన్యమృగ సంరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

జంతు రాజ్యంలో అడవికి రాజైన సింహం తర్వాత అగ్రస్థానం పులిదే. పెద్దపులి రాజసం ఇతర ఏ జంతువుకు రాదు. వేటగాళ్ల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. గత వందేళ్లలో పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పులులు మనగడను ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. పెద్దపులులను భవిష్యత్ తరాలు జూలోనే చూసేలా పరిస్థితులు తయారవుతున్నాయి. నాగరిక సమాజం పులుల పాలిట శాపంగా మారుతోంది. 1972 నవంబర్ 18వ తేదిన భారత జాతీయ జంతువుగా పెద్దపులిని స్వీకరించారు. ప్రభుత్వం జాతీయ జంతువుగా ప్రకటించింది. పులి భారతదేశం, బంగ్లాదేశ్, మలేషియా, దక్షిణ కొరియా దేశాలకు జాతీయ జంతువు. శాస్త్రీయ నామం పాంథేరా టైగ్రిస్. టైగర్ అనే పదం గ్రీకు భాషలోని టైగ్రిస్ నుండి వచ్చింది. దాని అర్థం బాణం. పాంథేరా అంటే పసుపు జంతువు అని అర్థం. సుమారు 11 అడుగుల పొడవు, 300 కిలోల వరుకు బరువు ఉంటుంది. సుమారు 5 మీటర్ల దూరం వరకు దూకుతుంది. గంటకు 65 కిమీ వేగంతో పరుగెడుతుంది. పులి ఒంటి మీద దాదాపుగా 100 చారలు ఉంటాయి. ఏ రెండు పులుల ఒంటి మీద చారలూ ఒకేలా ఉండవు. పెద్దపులి ఉందంటే ఆ అడవిలో పర్యావరణ సమతుల్యం పరిఢవిల్లుతుంది. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టుపక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్‌లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ఆ ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్ని రకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతోకూడిన దట్టమైన అడవి అయ్యి ఉండాలి. ఇది పెద్దపులి రాజసం. మన దేశంలో రాయల్ బెంగాల్ టైగర్ ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన జాతి. రాణా టైగర్‌గా వ్యవహరించే ఈ పులిని మన ప్రభుత్వం జాతీయ జంతువుగా ప్రకటించింది. పులి (పాన్థెర టైగ్రిస్) ఫెలిడే కుటుంబానికి చెందినది. పాన్థెరా తరగతికి చెందిన నాలుగు పెద్ద పిల్లులలో ఇది ఒకటి. భారతదేశం ప్రపంచంలో కెల్లా అత్యధికంగా అడవులలో నివసించే పులుల జనాభాను కలిగి ఉన్న దేశం. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ప్రకారం, ప్రపంచంలోని పులులలో ఎక్కువ శాతం భారత దేశంలోనేఉన్నాయి. పూర్వకాలంలో పులులు ఎక్కువగా వుండేవి. ప్రజారక్షణ కారణంగా రాజులు వాటిని వేటాడేవారు. ఇప్పుడు వాటికే రక్షణ కరువైంది అనటంలో ఎటువంటి సందేహం లేదు. పులులను వేటాడటానికి, స్మగ్లింగ్ చేయటానికి కారణం పులి చర్మం, గోర్లు, దంతాలు చాలా విలువైనవిగా భావి



స్తున్నారు. పులిలో ఔషధగుణాలు వున్నాయి అని నమ్ముతారు. ఔషధ గుణాలు వున్నట్టు ఎటువంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవు. పులుల్ని వేటాడటం ఆ తర్వాత వాటి చర్మాలను ఇంట్లోని గోడలకు వేలాడదీయటం మన పూర్వపు రాజులకు ఒక ఆట. పులిగోర్లను లాకెట్లలో ధరించి మేడలో వేసుకోవటం రాచరికానికి హోదాగా భావించేవారు. మొఘల్ చక్రవర్తులలో అక్బర్‌కు పులుల వేట అంటే చాలా ఇష్టం. పులుల్ని వేటాడటం అనేది రాచరికపు హుందాతనానికి దర్పణంగా భావించేవారు. జానపద సాహిత్యంలో రాజకుమారుల వీరత్వాన్ని తెలపాలంటే, శౌర్యాన్ని ప్రదర్శించాలంటే పులులతో తలపడటమే ఉండేది. రాజులు, జమీందారులు పూర్వం వేటను వినోదంగా భావించేవారు. గ్రామాల్లోకి వచ్చే పులులను వేటగాళ్లు కాపుకాసి మట్టుబెట్టేవారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవటం వలన, ఇలాంటి వేటల వలన కారణాలు ఏమైతేనేం నేడు పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పులి మన జాతీయ జంతువు. పూర్వ పు రాజులు పులుల బొమ్మలను తమ జెండాల మీదా, మిలటరీ చిహ్నాలుగానూ ఉపయోగించేవారు. క్రీడల పోటీల సమయంలో వాటిని ఆయాదేశాల మస్కట్‌లుగా కూడా రూపొందిస్తునారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల, వేట గాళ్ల వల్ల పులుల సంఖ్య 2010 సంవత్సరంలో లెక్కల ప్రకారం 3200 సంఖ్యకు తగ్గిపోయాయి. పెద్ద సైజుఅడవి పులులు 3.38 మీటర్ల పొడవు వరకు ఉంటుంది. 380 కిలోల బరువును కలిగి యుంటుంది. సాధారణ మగపులి దాదాపు 250 కిలోల బరువు ఉంటుంది. ఆడపులి సుమా రు 160 కిలోల వరకు బరువు ఉండవచ్చు. సాధారణంగా పులులలో 41 రకాల ఉపజాతులున్నాయి. వీటిలో ఎన్నో రకాల పులులు ప్రస్తుతం అంతరించాయి. అంతరించిపోయే దశలో ఉన్నాయి. అందువలననే పులుల సంరక్షణ చాలా ఆవశ్యకం. ప్రస్తుతం ఉన్న జాతుల్లో బెంగాల్ టైగర్, ఇండో చైనీస్ టైగర్, మలయన్ టైగర్, సైబీరియన్ టైగర్, సౌత్ చైనా టైగర్, సుమత్రన్ టైగర్ ఉన్నాయి. భారత్, నేపాల్, టర్కి భూటాన్, రష్యా దేశాలలో పులులు ఎక్కువగా ఉంటాయి. 1913లో ప్రపంచ వ్యాప్తంగా పులులు లక్ష దాకా ఉండేవి. పులులు అధికంగా జీవిస్తున్న దేశాలలో భారతదేశం మొదటి స్థానంలో ఉన్నది. మన దేశంలో పలు 47అభయారణ్యాలు ఉన్నాయి. భారత్‌లో పన్నెండేళ్లలో పులుల సంఖ్య రెట్టింపైంది. 2006లో 1,411గా ఉన్న వీటి సంఖ్య, 2010లో 1,706గా ఉన్న పులుల సంఖ్య 2014 నాటికి 2,226కు, 2018లో 2,967కు చేరింది. గత ఆరేళ్లలో ఏడు వందలకు పైగా పెరిగింది. 2014లో అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో పులుల సంఖ్య 68కాగా, 2018 నాటికి ఏపీ,తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య 74కుచేరింది. ఏపీలో 48, తెలంగాణలో 26 పులులు ఉన్నాయి. పెద్ద పులులు గతంలో దట్టమైన అరణ్యాల్లోనే ఉండేవి. మను షుల జాడ ఉంటే మకాం మార్చేవి. కొన్నాళ్లుగా పులుల సంతతి పెరుగుతోంది. అదే సమయంలో అటవీ విస్తీర్ణం తగ్గుతోంది. ఈ క్రమంలో ఆవాసం కోసం అటవీ శివారు ప్రాంతాలకు అంటే జనావాసాల సమీపానికి పులులు వచ్చేస్తున్నాయి. అడవుల పెంపకంపై దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# మళ్లీ నితీషే సిఎం

## 20న బీహార్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు

### ఆర్జేడి శాసనసభా పక్షనేతగా తేజస్వి ఎన్నిక



**పాట్నా, నవంబరు 17:** బీహార్‌లో 20వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ నేతృత్వంలోనే సర్కార్ ఏర్పాటు కాబోతున్నదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ సోమవారం ప్రకటించారు. మరోవైపు సిఎం నితీష్‌కుమార్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కోరుతూ తీర్మానం ఆమోదించారు. అనంతరం సిఎం పదవికి రాజీనామా చేసి గవర్నర్ అరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు అందజేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని నితీష్‌కుమార్‌ను గవర్నర్ కోరారు. ఇదిలా ఉండగా, ఎన్‌డిఏ భాగస్వామ్య పక్ష ఎమ్మెల్యేలతో మంగళవారం సిఎం నితీష్ సమావేశం కానున్నారు. ఈ భేటిలో ఎన్‌డిఏ శాసనసభాపక్ష నేతగా నితీష్‌కుమార్‌ను ఎన్నుకోనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ తెలిపారు. ఇదిలా ఉండగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో హెచ్‌ఎఎం అధ్యక్షుడు జితిన్‌రామ్ మాంజీ సమావేశమై మంత్రివర్గ కూర్పుపై చర్చించారు. ఎన్‌డిఏ మరో భాగస్వామ్య పార్టీ ఆర్‌ఎల్‌డి చీఫ్, రాజ్యసభ సభ్యుడు ఉపేంద్ర కుష్వాహ కూడా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో భేటీ అయి, కేబినెట్ కూర్పుపై సమాలోచనలు జరిపారు. తేజస్వి యాదవ్ ఆర్‌జెడి శాసనసభా పక్ష నేతగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ఆర్‌జెడి ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో 10శాతం సీట్లు(25) సాధించిన ఆర్‌జెడి ప్రతిపక్షంగా గుర్తింపు దక్కనుంది. బీహార్ అసెంబ్లీ కొలువుదీరిన తర్వాత ప్రతిపక్ష నేతగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్‌ను గుర్తింపుపొందనున్నారు. రాఘోపూర్ స్థానంలో తేజస్వి యాదవ్ 14,532 ఓట్లతో బిజెపి అభ్యర్థి సతీష్ కుమార్‌పై విజయం సాధించిన విషయం తెలిసిందే.

### ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమే..

## దుశ్చర్యలకు దిగితే సినిమా చూపిస్తాం

### పాకిస్థాన్‌కు ఆర్మీచీఫ్ తీవ్రస్థాయి హెచ్చరికలు



**న్యూఢిల్లీ, నవంబరు 17:** దాయాది పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ ఏడాది మేలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమేనని అన్నారు. దాయాది ఏదైనా దుశ్చర్యలకు పాల్పడితే గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉపేంద్ర ద్వివేది ఈ సందర్భంగా మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ 88 గంటల్లో ముగిసిన ట్రైలర్ మాత్రమే. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులకైనా మేం సిద్ధంగా ఉన్నాం. పాక్ అవకాశం ఇస్తే పొరుగుదేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో దాయాదికి మేము నేర్పిస్తాము' అని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల శ్రేయస్సు, పురోగతిపై దృష్టి పెడుతుందని జనరల్ ద్వివేది తెలిపారు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుందన్నారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే దేశాలతో చర్చలు ఉండవని తేల్చి చెప్పారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తూ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని దాయాది పాక్‌కు జనరల్ ఉపేంద్ర ద్వివేది గట్టిగా హెచ్చరించారు.

## ఇడి విచారణకు మళ్లీ అనిల్ అంబానీ గైర్హాజరు



**న్యూఢిల్లీ, నవంబరు 17:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణకు గైర్హాజరయ్యారు. ఫెమా కేసులో ఇడి ముందు ఈ నెల 14న విచారణకు రావాల్సి ఉండగా.. ఆయన హాజరు కాలేదు. విడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతునని ఇడిని అభ్యర్థించారు. ఆయన విజ్ఞప్తిని తిరస్కరించిన ఇడి.. సోమవారం (17)న విచారణకు హాజరుకావాలంటూ రెండోసారి సమన్లు జారీ చేసింది. సోమవారం సైతం అనిల్ అంబానీ విచారణకు దూరంగా ఉన్నారు. చెప్పిన తేదీకి విడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని ఇడికి మరోసారి తెలియజేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అనిల్ అంబానీకి మరోసారి సమన్లు జారీ చేస్తారా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. బ్యాంకులను మోసం చేసిన మనీ లాండరింగ్ కేసులో అనిల్ అంబానీకి ఇడి సమన్లు జారీ చేసింది. ఆగస్టులో కూడా ఇదే కేసులో అనిల్‌ను సుమారు 10 గంటలపాటు ఇడి ప్రశ్నించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి రూ. 2,929 కోట్ల రుణం తీసుకున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), మనీ లాండరింగ్‌కు పాల్పడిందనేది ఆరోపణ. ఆగస్టు 21న కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి విచారణ కొనసాగుతోంది, ఈ కేసులో సిబిఐ ఇప్పటికే ముంబయిలోని అంబానీ ఇంటితోపాటు పలు చోట్ల సోదాలు నిర్వహించింది.

### ఓటర్ జాబితాల సవరణను స్వాగతించిన అసోం సిఎం

**గువాహతి, నవంబరు 17:** అసోం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆదేశించింది. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న ప్రచురిస్తామని వెల్లడించింది. ఈ ప్రత్యేక సవరణ జనవరి ఒకటి వరకు చేపట్టాలని అసోం ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ సూచించింది. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ రాష్ట్రంలో ప్రత్యేక సవరణ నిర్వహించాలన్న ఈసీ నిర్ణయాన్ని స్వాగతించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. జనవరి ఒకటి వరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నిర్వహించాలన్న ఈసీ నిర్ణయాన్ని అసోం ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. ఇది అర్హత ఉన్న పౌరులందరికీ స్పష్టమైన, అప్‌డేట్ చేసిన ఖచ్చితమైన ఓటరు జాబితాను సిద్ధం చేయడంలో సహాయపడుతుందన్నారు. ఈ సవరణ పారదర్శకంగా, సకాలంలో పూర్తయ్యేలా ఎన్నికల సంఘానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. వచ్చే ఏడాది అసోం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా అక్టోబర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండోదశ 'సర్' కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, తుది ఓటర్ల జాబితా ఫిబ్రవరి 7న ప్రచురించనున్నారు.



### ఆత్మాహుతి బాంబర్ సహచరుడి విచారణ

## శ్రీనగర్‌లో పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ డ్యానిష్ అరెస్టు

**న్యూఢిల్లీ, నవంబరు 17:** ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడుపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. కశ్మీరీ ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ నబీ సహ కుట్రదారుడు అమీర్ రషీద్ అలీ కీలక విషయాలు వెల్లడించాడు. అంతేకాకుండా డాక్టర్ ఆదిల్ రాథర్, డాక్టర్ ముజఫర్ గనైతో సహా ఇతర నిందితుల విచారణ ఆధారంగా శ్రీనగర్ పోలీసులు పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ డానిష్‌ను అరెస్ట్ చేశారు. డాక్టర్ ఉమర్ పేలుడు పదార్థాలు ఉన్న వాహనాన్ని ఢిల్లీలోని రద్దీగా ఉండే ప్రదేశంలో, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో వదిలిపెట్టి వెళ్లాలని కుట్ర పన్నినట్లుగా అధికారులు తెలిపారు. ఆత్మాహుతి బాంబర్ కోసం అన్వేషన జైష్ ఏ మహ్మద్‌తో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తులో ప్రమాదకరమైన కొత్త కోణం వెలుగులోకి వచ్చినట్లయ్యింది. డానిష్ విచారణ ఆధారంగా 2021లో టర్కీకి వెళ్లిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ ఘనీ వైట్‌కాలర్ టెర్రరిస్ట్ మాడ్యూల్ సభ్యుడు డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ ఘనీతో కలిసి డాక్టర్ ఉమర్ తీవ్రవాదం వైపు వెళ్లాడని అక్కడ జైష్ ఏ మహ్మద్ భూగర్భ గ్రౌండ్ కార్యకర్తను కలిశాడు. ఈ అనుమానితుల ప్రొఫైల్ 20 సంవత్సరాల కిందట నియమించబడిన ఉగ్రవాదుల ప్రొఫైల్ నుంచి భిన్నంగా ఉంది. 2000వ సంవత్సరం నుంచి 2020 వరకు ఉగ్రవాద సంస్థలు ఇప్పటికే ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్న యువతపై దృష్టి సారించాయి. జైళ్లలో పెద్ద సంఖ్యలో యువత పెద్ద సంఖ్యలో యువత తీవ్రవాదానికి గురయ్యారు. ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు దాడిలో డాక్టర్ ఒమర్ నబీ 30 నుంచి 40 కిలోగ్రాముల పేలుడు పదార్థాలను ఉపయోగించారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో పేలుడులో అమ్మోనియం నైట్రేట్ ఉపయోగించినట్లు నిర్ధారించారు. పేలుడును మరింత శక్తివంతం చేయడానికి అమ్మోనియం నైట్రేట్‌తో పాటు ఇతర పేలుడు పదార్థాలను ఉపయోగించారని అనుమానిస్తున్నారు. అమ్మోనియం నైట్రేట్‌తో ఏ రసాయనాలను ఉపయోగించారో తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోంది. కారు వెనుక భాగంలో పేలుడు పదార్థాలు నిల్వ చేసినట్లు అనుమానిస్తున్నారు. డాక్టర్ ఒమర్ నబీ కారు హుడ్‌కు డిటోనేటర్‌ను అమర్చి, కారు వెనుక భాగంలో నిల్వ చేసిన పేలుడు పదార్థాలను పేల్చడానికి దాన్ని ఉపయోగించారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రెండు రోజుల కిందట పార్కింగ్ స్థలంలో 3.29 గంటల పాటు ఉమర్ బస చేసిన సమయంలో పేలుడు పదార్థాలను తయారు చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఒంటరిగా పేలుడు పదార్థాలను తయారు చేశాడా మరెవరైనా సహాయం అందించారాఅన్న విషయం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందు కోసం దర్యాప్తు సంస్థలు మొత్తం ప్రాంతం నుంచి డంప్ డేటాను సేకరించాయి. దర్యాప్తు సంస్థలు సంఘటన స్థలం నుంచి 40కిపైగా నమూనాలను సేకరించాయి. డిటోనేటర్ హుడ్ కింద ఉన్న బ్యాటరీకి అనుసంధానించినట్లుగా అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి పలు సన్నని వైర్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్‌సీఆర్, హర్యానాలోని దాదాపు 5వేల సీసీటీవీ కెమెరాల సహాయంతో దర్యాప్తులు పేలుడు తర్వాత దాదాపు 500 నుంచి 600 మీటర్ల వ్యాసార్థంలో ఐ20 కారు ముక్కలను స్వాధీనం చేసుకున్నాయి. ఏ రకమైన పేలుడు పదార్థం కారును చిన్న ముక్కలుగా విరిచిందో తెలుసుకోవడానికి వారి ఫోరెన్సిక్ దర్యాప్తు జరుగుతోంది. ఢిల్లీ, హర్యానా, జమ్మూ కశ్మీర్, యూపీలోని వివిధ ప్రాంతాలలో దర్యాప్తు బృందాలు నిరంతరం దాడులు జరుపుతున్నాయి. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో మరణించిన ఆటో డ్రైవర్ బిలాల్ అహ్మద్ పోస్టుమార్టం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని గందర్బాల్‌లో నివసించే బిలాల్ కుటుంబం ఎస్ఎస్‌పీ ద్వారా ఢిల్లీ పోలీసులను సంప్రదించి ఢిల్లీకి వస్తామని చెప్పింది. ఈరిక్షా డ్రైవర్ అయిన బిలాల్ వస్తువులను వదిలి ఎర్రకోటకు తిరిగి వస్తుండగా పేలుడులో గాయపడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ దాడి చేసిన డాక్టర్ ఒమర్ నబీ మృతదేహంలోని పలు ముక్కలు మార్చురీకి తరలించారు.

మృతదేహాన్ని డీఎన్ఏ ద్వారా గుర్తించారు. భద్రతా బలగాలు అతని కుటుంబాన్ని ప్రశ్నిస్తున్నాయి.

> **పేలుడులో ఆటోడ్రైవర్ బిలాల్ మృతి, మృతదేహంకోసం ఇప్పటికీ రాని కుటుంబీకులు**
>
> **ఆత్మాహుతిబాంబర్ చేయిని భద్రపరిచిన అధికారులు**

## పశ్చిమబెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు



> **ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిల్వ చేశారంటూ గవర్నర్‌పై టిఎంసి ఎంపి కల్యాణ్ ఆరోపణలు!**

**కోల్‌కతా, నవంబర్ 17:** పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్ ప్రాంగణంలో ఆయుధాలు, మందు గుండు సామగ్రిని నిలువ చేశారంటూ టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వీటిని తీవ్రంగా పరిగణించిన గవర్నర్ సివి ఆనంద్‌బోస్ సోమవారం రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బందితో తనిఖీలు చేయించారు. 'ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిలువ చేశారా? అని గుర్తించేందుకు కోల్‌కతా పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కూడిన బృందానికి గవర్నర్ బోస్ నేతృత్వం వహించారు. అని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేసేందుకు ఎస్ఐఆర్ ఎంతో అవసరమని శనివారం గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే గవర్నర్, రాజ్‌భవన్‌ను టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ లక్ష్యంగా చేసుకున్నారు. రాజ్‌భవన్ లోపల బిజెపి నేరస్థులకు గవర్నర్ ఆశ్రయం కల్పించారు. వారికి బాంబులు, తుపాకులు సమ కూర్చారు అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో గవర్నర్ ఉత్తర బెంగాల్‌లో తన పర్యటనను కుదించుకుని రాజ్‌భవన్‌కు తిరిగి వచ్చారు. ఈ క్రమంలోనే తని ఖీలకు నేతృత్వం వహించారు. సోదాల కోసం రాజ్‌భవన్ ప్రాంగణాన్ని ఖాళీ చేయించారు. పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద కూడా సిబ్బందిని మోహరించారు. వివిధ విభాగాల అధికారులు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గవర్నర్ వెంట జర్నలిస్టులతో పాటు ప్రముఖులు ఉన్నారు. ఇదంతా ప్రత్యక్ష ప్రసారం చేయించారు అని సంబంధిత అధికారి తెలిపారు. బెనర్జీ ఆరోపణలపై చట్టపరమైన అభిప్రాయం కోరినట్లు గవర్నర్ బోస్ ఇప్పటికే తెలిపారు. మరోవైపు ఈ వ్యవహారంపై కోర్టులో పోరాటానికి సిద్ధంగా ఉన్నానని, తనను బెదిరిం చలేరని ఎంపి కల్యాణ్ బెనర్జీ స్పష్టం చేశారు.

## ఉగ్రవాద గ్రూపులకు మద్దతు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు

### పాక్‌ను హెచ్చరించిన భారత్ సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ, నవంబర్ 17:** పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాద మూకలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని, తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని జనరల్ ద్వివేది అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామన్నారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం బ్లాక్‌మెయిల్ భయపడే స్థితిలో భారత్ లేదని శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఒక్కతాటిపై పని చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఇంతకు ముందుతో పోల్చితే దేశమైన చైనాతో భారత్ సంబంధాలు బలపడుతున్నాయన్నారు.

### ఢిల్లీపేలుళ్లకు నేపాల్‌నుంచి సెకండ్‌హ్యాండ్‌ఫోన్ల కొనుగోలు

#### ఏడు ఫోన్లు, 18 సిమ్‌కార్డులు వినియోగం

**న్యూఢిల్లీ, నవంబరు 17:** ఢిల్లీ పేలుళ్ల కుట్రదారులు సెకెండ్ హ్యాండ్ ఫోన్లను ఉపయోగించినట్లు తేలింది. కుట్రదారులు పొరుగుదేశం నేపాల్‌లో ఏడు సెకెండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేసి దాదాపు 17 సిమ్ కార్డులను ఉపయోగించినట్లు తేలింది. అందులో ఆరు సిమ్ కార్డులను ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లోని బెకాన్‌గంజ్ అడ్రస్‌తో తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. సంబంధితకు సిమ్ కార్డుకు ఇచ్చిన ఆధారాల ఆధారంగా భద్రతా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌లో పలువురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు.

## కాంగో రాగి గనుల్లో కుప్పకూలిన వంతెన

### 32 మంది మృతి, మరికొందరికి గాయాలు

**కిన్షాసా(కాంగో), నవంబరు 17:** ఆఫ్రికా దేశం కాంగోలో ఘోర ప్రమాదం జరిగింది. రాగి గనిలో వంతెన కుప్పకూలింది. దీంతో 32 మంది మృతి చెందారు. కాంగోలోని లువాలాబా ప్రావిన్స్‌లోని కలాండో సైట్‌లో రాగి గని ఉంది. ఈ మైనింగ్ సైట్‌లో వందలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ వద్ద కాల్పుల శబ్దం వినిపించడంతో ఇరుకైన వంతెనపై కార్మికులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో అది కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం ఇప్పటివరకు సుమారు 32 మంది చనిపోయారని మైనింగ్ ఏజెన్సీ తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. కాంగోలో ఈ ఏడాది జరిగిన అతిపెద్ద మైనింగ్ ప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది. 49 మంది మరణించారని, మరో 20 మంది దవాఖానాలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి విషమంగా ఉందని రాయిటర్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాంగోలో మైనింగ్ గని ముఖ్యమైన జీవనాధారం.

దాదాపు 15 లక్షల నుంచి 20 లక్షల మంది ఈ గని ద్వారా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా లక్షలాది దీని మీద ఆధారపడి బతుకుతున్నారు. అయితే కనీస భద్రతా చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధించిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది

## సంక్షిప్తంగా..

### పాక్‌లోఉవ్వెత్తున నిరసనలు



**ఇస్లామాబాద్, నవంబరు 17:** పాకిస్థాన్‌లో ఇటీవల ఆమోదం పొందిన 27వ రాజ్యాంగ సవరణ తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ సవరణకు వ్యతిరేకంగా సింధ్ ప్రావిన్స్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్ అవామీ తెహ్రీక్ (పీఏటీ), దాని మహిళా విభాగం సింధియానీ తెహ్రీక్ (ఎస్టీ) ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కార్పొరేట్ ఫార్మింగ్, సింధు నదిపై కొత్త కాలువలు, సింధ్ వనరుల దోపిడీని నిరసిస్తూ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి తమ గళం వినిపిస్తున్నారు. జైల్ రోడ్ నుంచి స్థానిక ప్రెస్ క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏటీ అధ్యక్షుడు వసంద్ థారీ మాట్లాడుతూ, 27వ సవరణ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. ఈ సవరణ ద్వారా పాలకులు రాజ్యాంగాన్ని వక్రీకరించి, ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు.

### భార్య లగేజీలో బాంబు ఉందని భర్త బెదరింపులు




**డల్లాస్, నవంబరు 17:** అమెరికాలో ఓ ప్రయాణికుడు సృష్టించిన కలకలంతో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. డాలస్ నుంచి షికాగో వెళ్తున్న విమానంలో తన భార్య లగేజీలో బాంబు ఉందని ఓ వ్యక్తి సిబ్బందికి చెప్పడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అప్రమత్తమైన పైలట్, విమానాన్ని వెంటనే దారి మళ్లించారు. ప్రయాణికుడి హెచ్చరికతో విమానాన్ని మిస్సోరీలోని సెయింట్ లూయిస్ లాంబెర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 8:40 గంటల సమయంలో సురక్షితంగా దించేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఎమర్జెన్సీ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ప్రయాణికులందరినీ కిందకు దించి, లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

### ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వెనక్కి తగ్గిన ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 17:** అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించిన విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఫైల్స్‌ను బహిర్గతం చేసే బిల్లుకు మద్దతు ఇవ్వాలని హౌస్ రిపబ్లికన్లను కోరారు. దీన్ని ఇంతకుముందు వ్యతిరేకించిన ఆయన.. ఇప్పుడు నిర్ణయాన్ని మార్చుకోవడం అమెరికాలో సంచలనంగా మారింది. 'దాయడానికి ఏమీ లేదు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రిపబ్లికన్ పార్టీ విజయాల నుంచి దృష్టి మరల్చడానికే 'రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్'లు సృష్టించిన తప్పుడు ప్రచారం అని ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసును ఉద్దేశించి అన్నారు. రిపబ్లికన్లు మళ్లీ అమెరికా ప్రయోజనాలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

### వ్యవస్థీకృత లోపాలవల్లే ఎగుమతుల సంక్షోభం

**కరాచి, నవంబరు 17:** పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఎగుమతుల సంక్షోభం తాత్కాలిక సమస్య కాదని, దశాబ్దాలుగా పేరుకుపోయిన లోతైన వ్యవస్థాగత లోపాల ఫలితమని ప్రపంచ బ్యాంకు తీవ్రంగా హెచ్చరించింది. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే తక్షణ సంస్కరణలు చేపట్టాలని సూచించింది. ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో పాకిస్థాన్ బలహీనమైన ఎగుమతులకు గల కారణాలను విశ్లేషించింది. అస్థిరమైన విధానాలు, వక్రీకరించిన మార్కెట్లు, సంస్కరణలను అమలు చేయడంలో నిరంతర వైఫల్యమే ప్రస్తుత దుస్థితికి కారణమని స్పష్టం చేసింది. 1990లలో పాక్ జీడీపీలో ఎగుమతుల వాటా 16 శాతంగా ఉండగా, 2024 నాటికి అది కేవలం 10 శాతానికి పడిపోయిందని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో భారత్, బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలు ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధిని సాధించాయని గుర్తుచేసింది.

# సిఎంతోపాటు ప్రముఖ నటుల నివాసాలకు మళ్లీ బాంబు బెదరింపులు

**చెన్నై,నవంబరు 17:** తమిళనాడులో ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని ఆకతాయిలు మరోసారి రెచ్చిపోయారు. సీఎం ఎంకే స్టాలిన్‌తో పాటు ప్రముఖ నటులు అజిత్ కుమార్, అరవింద్ స్వామి, ఖుష్బూ నివాసాల్లో బాంబులు పెట్టినట్లు ఆదివారం రాత్రి ఈమెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. ఈ హెచ్చరిక ఈ మెయిల్ డీజీపీ కార్యాలయానికి కూడా రావడంతో పోలీసులు తక్షణమే అప్రమత్తమయ్యారు. ఈమెయిల్ సమాచారం అందిన వెంటనే, బాంబు నిర్వీర్యక దళాలు రంగంలోకి దిగాయి. సీఎం స్టాలిన్, ముగ్గురు నటుల నివాసాలకు ఏకకాలంలో చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. గంటలపాటు సాగిన సోదాల్లో ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అదంతా ఉత్తిదేనని తేలింది. దీంతో అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. నటుడు అజిత్ కుమార్‌కు బాంబు బెదిరింపు రావడం వారం రోజుల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. గత వారం కూడా చెన్నైలోని ఇంజంబాక్కంలో ఉన్న ఆయన నివాసానికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. ఇటీవల కాలంలో చెన్నైలో ఇలాంటి బెదిరింపులు ఎక్కువయ్యాయి. కొద్ది రోజుల క్రితం నటుడు అరుణ్ విజయ్ ఇంట్లో, సంగీత దర్శకుడు ఇళయరాజా స్టూడియోలో బాంబులు పెట్టామని ఇలాగే బెదిరింపులు రాగా, అవి కూడా ఆకతాయిల పనేనని తేలింది. వరుస ఘటనలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించారు. బెదిరింపు ఈమెయిల్స్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నారు. తమిళనాడులోని పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలకు గత కొన్నిరోజులుగా వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్, ప్రముఖ నటులు త్రిష, నయనతార, ప్రభు, రజినీకాంత్, ధనుష్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా స్టూడియోస్, బీజేపీ ప్రధాన కార్యాలయానికి, డీజీపీ ఆఫీసుకి, రాజ్‌భవన్, చెన్నైలోని అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, థాయిలాండ్, శ్రీలంక, సింగపూర్ కార్యాలయాలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. చెన్నైలోని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అయితే, అవన్నీ నకిలీ బెదిరింపులు.





# బాధిత కుటుంబాలకు బాసటగా ప్రభుత్వం

**సౌదీ బాధిత కుటుంబాలకు**

**పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పరామర్శ**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** మక్కా దుర్ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, చనిపోయిన 18 మంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అడిక్‌మెట్ అచ్యుత్‌మార్గ్ ప్రాంతంలో సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను సోమవారం సాయంత్రం పిసిసి చీఫ్ మహేష్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఫిరోజ్‌ఖాన్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అక్కడి అధికారులతో నిరంతరం సంభా షిస్తున్నారని తెలిపారు. సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో 42 మంది మృతి చెందారు.. అందులో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంవారు 16 మంది ఉండటంతో ముఖ్యమంత్రి అన్ని రకాల చర్యలు చేపట్టారని వారికి తెలిపారు. ఎన్నారై అడ్వైజరీ కమిటీ వినోద్ ఆ చర్యల్లో ఉందని వివరిం చారు. సౌదీ అరేబియాలో ఉన్న ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ వినోద్, వైస్‌ఛైర్మన్ భీమ్ రెడ్డిలతో మాట్లాడి వివరాలు అడిగి తెలు సుకున్నారని తెలిపారు. అధికారులు ఎన్నారై కమిటీతో సమన్వయం చేసుకుంటూ వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారని తెలిపారు. వారి మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేస్తున్నవారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అన్నిరకాల చర్యలు తీసుకుంటుంది తెలిపారు.


## కేరళలో గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయీసంఘం సమావేశానికి ఎంపి చామల

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** కేరళలో స్థానిక సంస్థలు అభివృద్ధి సంక్షేమంపై తీసుకొంటున్న చర్యలు దేశవ్యాప్తంగా ఆచరణీయంగా ఉన్నాయని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కేరళలోని కోచిలో జరిగిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ పార్లమెంటరీ స్థాయి స్టాండింగ్ కమిటీ అధ్యయన సమావేశం ఛైర్మన్ మగుంట శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తోటి స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి పాల్గొ న్నాను. ఈ సమావేశంలో కేరళ రాష్ట్ర స్థానిక స్వయంపాలనా శాఖ, సుచిత్వ మిషన్, కోచి మెట్రో రైల్ లిమిటెడ్, స్మార్ట్ సిటీ తిరువనంతపురం, కొచ్చిన్ కార్పొరేషన్, గ్రేటర్ కొచ్చిన్ డెవలప్మెంట్ అథారిటీ, కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ మరియు హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు జరుగుతున్న పనులు జరుగవలసిన పురోగతిని ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని పట్టణాలలో మౌళిక వసతుల కల్పనకు కేంద్రం నిధులు ఇవ్వాలని అన్నారు.

## వేధింపులు తాళలేక నిండుగర్భిణి ఆత్మహత్య

**మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** అడిగినంత కట్నం, సామాగ్రి పెట్టి వైభవంగా పెళ్లి అత్తవారింటికి తమ కూతురును సాగనంపారు. కొద్ది



రోజులకు కూతురు గర్భవతి అని తెలిసి సంతోషించారు. అంత లోనే భర్త అదనపుకట్నం కావాలని వేధిస్తున్నాడని, దాన్ని తట్టుకోలేక నిండు గర్భిణి ఆత్మహత్య చేసుకున్నది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో మంత్రి ఉమా, కుమార్‌ల రెండో కుమార్తె మల్లెబోయిన మౌనిక(22) గత సంవత్సరం డిసెంబరులో భూపాలపల్లి జిల్లా ఘన్‌పూరం మండలం బుదారం గ్రామానికి చెందిన మల్లెబోయిన ప్రశాంత్‌తో వివాహం చేసారు. రెండు గుంటల భూమి, 8 లక్షల నగదుతో బంగారం, సామాగ్రి కట్నంగా అందించారు. కొంతకాలంగా మృతురాలు మౌనిక భర్త ప్రశాంత్, అత్త మామలు నరసమ్మ, సంపత్ మోటర్ సైకిల్ పేరుతో అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించారని, భరించలేకనే ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడిందని మృతురాలి తల్లి మంత్రి ఉమా ఇల్లందకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలు ప్రస్తుతం ఏడు నెలల గర్భిణీ అని ఫిర్యాదులో తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎంఇడి, ఎంపిఇడి మొదటి విడతలో 655 మందికి సీట్ల కేటాయింపు

**రేపటిలోగా కాలేజీల్లో చేరాలి**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కాలేజీల్లో ఎంఈడీతోపాటు ఎంపిఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన సిపిజిఈటీ-2025లో మొదటి విడత సీట్ల కేటాయింపు సోమవారం చేశారు. మొది విడతలో 655 మందికి సీట్లను కేటాయించారు. సీటు పొందిన వారు రేపటి(బుధవారం)లోగా కాలేజీల్లో చేరాలని సిపిగెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో బాగంగా ఈ నెల 8 నుంచి 11 వరకు సిపిగెట్‌లో అర్హత సాధించిన వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కమ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సర్టిపికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసి ఈ నెల 12న కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి వివరాలను ప్రకటించారు. వారు ఈ నెల 12, 13 తేదిల్లో వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వారికి మొదటి విడతలో సోమవారం సీట్ల కేటాయింపు చేశారు. మొదటి విడతలో 1258 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 655 మందికి సీట్ల కేటాయింపు చేశారు.

# కలుపు మొక్కలపై నోటీసులు వస్తే చర్యలు

**అధిష్ఠానం చేతిలో డిసిసి ప్రెసిడెంట్ల తుది నిర్ణయం**


**అసదుద్దీన్ ఏం మాట్లాడినా కాంగ్రెస్ గుర్తుకే మద్దతు**

**పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో గంజాయి,కలుపు మొక్కలున్నట్లు ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ పేర్లు ఇస్తే విచారణ చేస్తా మని, నోటీసులు వస్తే తప్పక చర్యలు తీసు కొంటామని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మా ట్లాడుతూ డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియలో మా సలహాలు సూచనలు ఎఐసిసి పెద్దలు తీసుకున్నారనీ, ఎప్పుడైనా పేర్లు అనౌన్స్ కావచ్చని గౌడ్ వెల్లడించారు. ఎఐసిసి సంపత్ కుమార్ లేవనెత్తిన ప్రశ్నలు పరిశీలిస్తా మనీ,పాత కొత్త అన్ని కలుపుకుని ముందుపోతామని తెలిపారు. పాత వారికి కూడా అవకాశం ఇస్తామనీ వివరించారు. బీహార్‌లో ప్రజల అభీష్టం ఆశయాల మేరకు ఎన్‌డిఏ అధికారంలోకి రాలేదని లౌకికవాద ఓటర్లు తొలగించారని ఆయన ఆవేదన చెందారు. బిహార్‌లో అవకతవకలు జరిగాయి. బీహార్‌లో పోటీ చేసిన అభ్యర్థులకు వచ్చిన ఓట్ల సంఖ్య ఎస్ఐఆర్ తరువాత రూపొందించిన ఓటర్ లిస్టులోని ఓటర్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉందని అప్రజాస్వామ్య యుతంగా బిజెపి గెలిచిందని ఆరోపించారు. మేము కాంగ్రెస్‌తో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి ఉన్నామని అసదుద్దీన్ చెప్పా రని గుర్తుచేశారు. రాజకీయాల్లో పరిస్థితులు అవసరాలు బట్టి రాజకీయాలు మారుతుంటా యనీ, అసదుద్దీన్ ఏం మాట్లాడినా జూబీహిల్స్ ఉపఎన్నికలలో కాంగ్రెస్ హస్తంగుర్తుకు మద్దతు ఇచ్చారుకదా అని అన్నారు. మక్కాలో జరిగిన ఘటన దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. అం దులో హైదరాబాద్ వాళ్లు ఉండడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం హెల్ప్ లైన్ ఏర్పాటు చేసిందనీ, చనిపోయిన 18 మంది కుటుంబాలను ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# ఉమ్మడి నల్గొండ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**మిర్యాలగూడ, నవంబరు 17, ప్రభాతవార్త:** ఉమ్మడి నల్గొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ 171.5ల వ్యయంతో చేపట్టిన పలు అభి వృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా శెట్టిపాలెం నుండి అవంతిపురం వరకు రూ. 74 కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్లరోడ్డు పనులకు స్థానిక మున్సిపాలిటీ పరిధిలో రూ. 41 కోట్ల బిటి, సిసి రోడ్డు, రూ. 15 కోట్ల వ్యయంతో మిర్యాలగూడ తడకమళ్ల డబల్ రోడ్డులు ఆరు లైన్లుగా మార్చేందుకు, మూడు కోట్ల రూపాయల వ్యయంతో పైవంతెన, మున్సిపాలిటీ ఏరియా, మునిసిపల్ ఆఫీస్ ఏరియా సుందరీకరణ పనులకు శంకుస్థాపన, 31 కోట్ల రూపాయల టీ ఎఫ్ యు ఐ డి సి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు మురికి కాలువల,రూ 5 కోట్ల తో నిర్మించిన కేఎన్ఎమ్ డిగ్రీ కళాశాల అదనపు భవనం, రూ 2.25 కోట్లతో నిర్మించిన జూనియర్ కళాశాల అదనపు భవనాన్ని వారు ప్రారంభించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, వనరులు, ఎత్తిపోత పథకాలను సత్వరమే నూరు శాతం పూర్తి మంత్రి చేస్తామన్నారు. 57 కోట్ల రూపాయల వ్యయంతో ప్రధాన కాలువ లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మిర్యా లగూడ నియోజక వర్గంలో రూ. 250 కోట్లతో రహదారుల మంజూరి, ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి డబల్ రోడ్డు నిర్మాణం, నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 450 కోట్లు, దేవరకొండ నియోజకవర్గం 350 కోట్లు హ్యాంరోడ్లకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రూ. 250 కోట్ల విలువగల హం రోడ్లమంజూరి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌మాలే పాటి, ప్రజారోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీరు కందుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేయాలి

**సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు రుణమాఫీని అమలు చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన నేతన్నల రుణమాఫీ అమలు కాక బ్యాంకుల్లో అసలు, వడ్డీలు పేరుకుపోతున్నాయని.. దానికి తోడు ప్రయివేటు అప్పుల భారం పెరిగి చేనేత కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయని సీఎంకి రాసిన లేఖలో జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే నేతన్నలకు రుణ మాఫీని అమలు చేయాలని, వారి ఇతర సమస్యలను కూడా పరిష్కరించి ఆదుకోవాలని సీఎంని లేఖలో కోరారు. చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తామని 2024 సెప్టెంబర్ 9న సీఎంగా ప్రకటించి, జీవో 56ను జారీ చేశారని, 2025-26 బడ్జెట్ నుంచి రు.33 కోట్లు మంజూరు కూడా చేశారని గుర్తు చేశారు. రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని, లక్షకుపైగా రుణం ఉన్న వారు ఆపై మొత్తాన్ని జూలైలోగా చెల్లిస్తేనే వారికి రుణమాఫీ అవుతుందని అధికారులు చెప్పడంతో,చాలామంది అప్పు తెచ్చి రుణం చెల్లించారు. కానీ నేటికీ రుణమాఫీ జరగలేదని.. తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరగడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చేనేత కార్మికుల రుణమాఫీ కోసం రు.48 కోట్లు వెంటనే విడుదల చేయాలని, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేసి పెట్టుబడి సాయం క్రింద రాయితీతో జీరో వడ్డీతో రు.5లక్షల కొత్త రుణం ఇవ్వాలన్నారు. చేనేత భరోసా పథకంలో జీయో టాగ్ ఉన్న చేనేత కార్మికుడికి నెలకు రు.2వేలు, అనుబంధ కార్మికులకు ఇద్దరికి కలిపి రు.1000లు అమలు చేయాలని, జియోటాగ్ ప్రక్రియను నిరంతరంగా చేయాలన్నారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, టెస్కోకు పాల కవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. త్రిఫ్ట్ పథకం ద్వారా మరణించిన నేతన్నలకు బీమా అమలు చేయాలని, రు.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. నూలు, రంగు లు, రసాయనాలపై, చేనేత చీరలపై జీరో జీఎస్‌టీ చేయాలని సిఎంకి రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు.

## ఇద్దరు పత్తి రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** అప్పుల బాధతో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇరువురు పత్తి రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వర్షాలకు పంటలు దెబ్బతిని తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో తీవ్ర మనస్తాపం చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలోని ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మండలం వేంపల్లి, రెబ్బెన మండలం గంగాపూర్‌లో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం సిర్పూర్(టీ) మండలం వేంపల్లికి చెందిన మొర్లె రాము (41) తనకు ఉన్న ఎకరం భూమితో పాటు, మరో నాలుగు ఎకరాలు పోడు భూమిలో పత్తి సాగుచేశారు. ఇందుకుగాను అందినకాడల్లా అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. అయితే ఇటీవల అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడంతో నష్టం వాటిల్లింది. మరో వైపు సుమారు రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అదేవిధంగా రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన ముంజం సంతోష్ (30) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ ఏడాది తన సోదరుడు తిరుపతితో కలిసి సంతోష్ 10 ఎకరాల్లో పత్తి పంట వేశారు. కానీ అధిక వర్షాల కారణంగా పత్తి పంట చాలా వరకు దెబ్బతినగా పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఇంటి పెరట్లో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు.

# అన్నదాతను వేధిస్తున్న టార్పాలిన్ల సమస్య

**సరఫరా నిలిపివేసిన వ్యవసాయ శాఖ**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను అరబెట్టుకోవటానికి వర్షాల నుంచి పంటను కాపాడు కునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ క్రమంలో అకాల వర్షాల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకు నేందుకు టార్పిలిన్లు రైతులకు ఇప్పుడు అత్యవసరం. వరి, కంది, ఇతర అంతర పంటలు సాగు చేసిన రైతులకు ధాన్యం ఆరబెట్టేందుకు తమ పొలాల్లో టార్పిలిన్లు ముఖ్యంగా కావాల్సి ఉంది. గతంలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను రైతులకు సరఫరా చేసేది. వర్షాలు, ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షి ంచు కోవటానికి వ్యవసాయ శాఖ గతంలో సబ్సిడీపై రైతులకు టార్పిలిన్లు అందించేది. మార్కెట్‌లో 2,500 రూపాయలకు లభించే టార్పిలిన్లను 50 శాతం సబ్సిడీతో 1,250 రూపాయలకే రైతులకు సరఫరా చేసేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ శాఖ టార్పాలిన్ల సరఫరాను నిలిపివేసింది. దీంతో మార్కెట్‌లో టార్పలిన్ల ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనలేక రైతులు అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు 15 రూపాయల నుంచి 20 రూపాయల వరకు అద్దెకు తెచ్చుకుంటున్నారు. ధాన్యం ఆరబెట్టుకోవటానికి సాధారణంగా ప్రతీ రైతు కనీసం ఆరు నుంచి 10 టార్పాలిన్లు అవసరం ఉంటుంది.

వాటిపై ప్రతీ రోజు అద్దెకు తెచ్చుకోవటంతో భారం పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోత దశకు రావటంతో రైతులంతా కోత మిషన్లతో వరి పంటను కోయిస్తున్నారు. ఇప్పుడు అకాల వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## దళిత యువకుడి హత్య కేసులో బాధ్యులను కఠినంగా శిక్షించాలి

**డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** షాద్‌నగర్‌లో దళిత యువకుడిని కుల దురహంకార హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం, ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర చంద్రశేఖర్ ప్రేమవివాహం చేసుకున్నాడన్న కారణంతో అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి, దారుణంగా హత్య చేసి, పెట్రోల్ పోసి సజీవదహనం చేసిన హంతకులను కఠినంగా శిక్షిచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలరోజుల క్రితం ఎర్ర చంద్రశేఖర్, కావలి భవాని చట్టబద్ధంగా మేజర్లుగా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని యువతి తండ్రి కావలి వెంకటేష్.. చంద్రశేఖర్ సోదరుడు రాజశేఖర్‌ను మాట్లాడుకుందాం అని పిలిచి నవాబుపేట ప్రాంతానికి తీసుకెళ్లి అమానుషంగా కొట్టి హత్య చేసి, పెట్రోల్ పోసి తగలబెట్టరన్నారు. కుల దురహంకార హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 ఫలితాలు విడుదల

**1,284 పోస్టులకుగానూ 1,260 మంది ఎంపిక**

**ఫలితాలను విడుదల చేసిన ఎంహెచ్ఎస్ఆర్‌బి**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్య శాఖలో 9203 పోస్టులు భర్తీ**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ఫలితాలను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బి) సోమవారం ప్రకటించింది. 1284 పోస్టులకు గానూ 1260 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. మిగిలిన పోస్టులకి సంబంధించిన అభ్యర్థుల ఎంపికను కోర్టు కేసులు, మెరిట్ అభ్యర్థులు లేకపోవడంతో ఎంపిక చేయలేదని బోర్డు ప్రకటించింది. డైరక్టర్ పబ్లిక్ హెల్త్ (డిపిహెచ్), డైరక్టర్ మెడికల్ ఎడ్యు కేషన్ (డిఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి), ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి పరిధిలో 1284 ల్యాబ్ టెక్నీషియన్ల నియామకం కోసం ఎంహెచ్ఎస్ఆర్‌బి సెప్టెంబర్ 11, 2024న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అందులో డిపిహెచ్, డిఎంఈ పరిధిలో 1088 పోస్టులు, టివివిపి ఫరిధిలో 183, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి పరిధిలో 13 పోస్టుల భర్తీకి నోటఫికేషన్‌ను జారీ చేసింది. ఇందుకు సంబంధించి 24,045 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 23,323 మంది సిబిటి పరీక్షలకు హాజరయ్యారని బోర్డు ప్రకటించింది. 1284 పోస్టులకి గానూ 1260 మంది మెరిట్ అభ్యర్థుల లిస్టును మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం ప్రకటించింది. కోర్టు కేసులతోపాటు, స్పోర్ట్స్ కోటా నియామకాలను పెండింగ్‌లో పెట్టింది.

1260 ల్యాబ్ టెక్నీషియన్స్ పోస్టులకి సంబంధించిన మెరిట్ లిస్టును ప్రకటించిన నేపథ్యంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల తోపాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ వేగవంతంగానూ, సులభతరంగా మారనుందని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఇప్పటివరకు ఆరోగ్య శాఖలో 9,203 పోస్టులు భర్తీ..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్య శాఖలో 9,203 పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 7,267 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. భర్తీ అయిన పోస్టుల్లో నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) - 6,956, సివిల్ అసిస్టెంట్ సర్జన్ - 422, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ - 138, అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంఎన్‌జే) - 28, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ - 24, ఫిజియోథెరపిస్ట్ - 48, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ - 18, ల్యాబ్ టెక్నీషియన్ - 285 (2024,) ల్యాబ్ టెక్నీషియన్ - 1,284. 2025లో జూనియర్ అసిస్టెంట్ - 334, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ - 01. భర్తీ ప్రక్రియ కొనసాగింపులో ఉన్న పోస్టులు- 7,267). వాటిల్లో నర్సింగ్ ఆఫీ సర్ (స్టాఫ్ నర్స్) - 2,322, ఫార్మసిస్ట్ - 732, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్) - 1,931, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 607, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ - 48, స్పీచ్ పాథాలజిస్ట్ - 4, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) - 1623 పోస్టులున్నాయి.

## సహకార సంస్థల పనితీరు మెరుగుపడాలి

**వారంలో సహకార సంఘాల ఆడిట్**

**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సహకార సంస్థల పనితీరు మెరుగుపడాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. అలాగే ఆడిట్‌ను కూడా సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



హైదరాబాద్ సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సహకార శాఖ ఆడిటర్లు రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్) ఆడిట్‌ను వారంలోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ సహాయం లేకుండా నడిచే సహకార సంఘాల ఆడిట్ ను జనవరిలోగా పూర్తి చేయాలని అన్నారు. సంఘాలలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన సెక్షన్ 51 ఎంక్వయిరీలు, సెక్షన్ 52 పరిశీలనలు చట్టం ప్రకారం నిర్ణయించిన సమయంలో పూర్తి చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా దుర్వినియోగం అయిన మొత్తాలను తిరిగి రాబట్టాలన్నారు. ఇప్పటికే సర్ ఛార్జీ చేయబడిన కేసుల విషయంలో దుర్వినియోగం అయిన మొత్తాలను రాబట్టుటకు చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎంక్వయిరీలు, సర్ చార్జీల విషయంలో ఏమైన కోర్టు కేసులు ఉంటే అవి త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు. సంఘాల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కాగా సహకార సంఘాల ద్వారా వరి కొనుగోళ్లను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాల ప్రకారం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అలాగే సహకార సంఘ పరిధిలో కనీసం 100 ఎకరాలపైన రైతులను గుర్తించి ఆయిల్ ఫాం సాగుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, హార్టీ కల్చర్ డైరెక్టర్ యాస్మిన్, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మేనమామ ఇంటికి వెళ్లిన ఇద్దరు

**సమస్యలుంటే దృష్టికి తీసుకురావాలి**

**గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు**

# బిసి గురుకుల విద్యార్థినులు క్షేమమే

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** బీసీ గురుకుల పాల్వంచ (బాలికల) పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిస్థులు క్షేమంగా ఉన్నారని గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఇద్దరు విద్యార్థినులు మేనమామ ఇంటికి వెళ్ళినట్టు గుర్తించారు. గంటల వ్యవధిలో విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. బీసీ గురుకుల పాల్వంచ (బాలికల) పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గురుకులం నుంచి వెళ్ళిన సంఘటనలో గంటల వ్యవధిలో విద్యార్థుల ఆచూకీని సిబ్బంది, పోలీసులు సహాయంతో కనుగొన గలిగారు. పాల్వంచ గర్ల్స్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు సోమవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి పారిపోయారు.

ఇద్దరు విద్యార్థులు కనిపించడం లేదన్న విషయాన్ని రోల్ కాల్ సమయంలో పీఈటీ, నైట్ కేర్ టీచర్ గుర్తించారు. క్యాంపస్‌లో పూర్తిగా వెతికిన తర్వాత సమాచారాన్ని ప్రిన్సిపాల్‌కు తెలియజేయగా.. ఆమె వెంటనే ఆర్‌సిఓకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఆర్‌సిఓ సొసైటీ కార్యదర్శి బడుగు సైదులుకి విషయాన్ని తెలియజేశారు. సెక్రటరీ సూచన మేరకు స్థానిక పోలీస్ స్టేషన్, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఓ సూచనల మేరకు సిసిటివీ ఫుటేజ్ ఆధారంగా అన్ని రైల్వేస్టేషన్, బస్ స్టేషన్‌లో విద్యార్థినుల కోసం వెతికారు. విద్యార్థినుల తల్లిదండ్రులతోపాటు వారి బంధువులను కూడా అప్రమత్తం చేయడంతో గంటల వ్యవధిలోనే విద్యార్థుల ఆచూకిని కనిపెట్ట గలిగారు.

ఇద్దరిలో ఒక విద్యార్థిని మేనమామ ఇంట్లో క్షేమంగా ఉన్న విద్యార్థులను గుర్తించి సురక్షి తంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులు, అధికారులకు కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల తమకు ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పాఠశాలను విడిచి వెళ్ళడం సరికాదన్నారు. అన్ని చోట్లా ఏర్పాటు చేసిన సీసీటీవీలు అనుక్షణం విద్యార్థుల కదలికను గమనిస్తూనే ఉంటాయని, విద్యార్థులు గుర్తుం చుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతకు సంబంధించి తాము అన్ని చర్యలు తీసుకుంటున్నామని సొసైటీ సెక్రటరీ సైదులు స్పష్టం చేశారు.

# ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్న ఇన్‌సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని నల్గొండ-వరంగల్-ఖమ్మంఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షంగౌడ్‌లతో కలిసి సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డితోపాటు జాతీయ విద్యామండలి(ఎన్‌సిటిఈ) ఛైర్మన్ పంకజ్ అరోరాని కలిసి విన్నవించినట్టు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి, ఎన్‌సిటిఈ ఛైర్మన్ మాట్లాడుతూ నేడు(మంగళవారం) కేంద్ర విద్యామంత్రితో జరగబోయే సమావేశంలో విద్యాహక్కు చట్టాన్ని సవరణ చేయడం ద్వారా లేదా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ అయి సరైన వాదనలు వినిపించి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న బిఈడి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయు(ఎస్‌జిటి)లకు త్వరలోనే ఇన్‌సర్వీస్ షార్ట్ టర్మ్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు జాతీయ విద్యామండలి ఛైర్మన్ పంకజ్ అరోరా తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటిలందరికీ పిఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతి పొందడానికి మార్గం సుగమం అవుతుందని పిఆర్‌టియు టిఎస్ నేతలు తెలిపారు.



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

# బిసి రిజర్వేషన్‌లు అమలులోకి వచ్చేదాక కేంద్రంపై కాంగ్రెస్ పోరాడాలి: జాజుల

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్‌లపై ముఖ్యమంత్రి నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి తరలివెళ్లాలని బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి బట్టి, మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబులతో జాజుల శ్రీనివాస్ గౌడ్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ జరుగుతున్న క్యాబినెట్ సమావేశంలో ఢిల్లీకి వెళ్లే అఖిలపక్ష తేదీని నిర్ణయించాలని, డిసెంబరు ఒకటో తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమి తరపున బీసీ రిజర్వేషన్లపై పోరాడాలని తెలిపారు. కేంద్రంపై రాష్ట్రం పోరాడి బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలిపేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలన్నారు. బీసీ రిజర్వే షన్లు పెంచకుండా క్యాబినెట్లో స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ కు గుణపాఠం చెపుతామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీని నిలబెట్టుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, కేంద్రాన్ని నిలదీయాల్సిన కాంగ్రెస్, ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలను వినియోగించుకోవాలని అన్నారు.

# కన్నతండ్రే కాలయముడు

## కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం

## నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** కన్న తండ్రి కాలయముడయ్యాడు. వైకల్యం కలిగిన పిల్లల్ని భారం అనుకొని అంతం అందించేందుకు సిద్ధమయ్యాడు. అనుకున్నది తడువుగా ఆచరణలో పెట్టి పిల్లలిద్దరిని హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో కూతురు ప్రాణం కోల్పోవు కొడుకు ప్రాణాపాయస్థితి నుండి తప్పించుకోగలిగాడు. చేసిన తప్పు నుండి తప్పిం చుకునేందుకు పరారైన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన హత్యాయత్నం, హత్య కేసులో ప్రధాన నిందితుడిని సోమవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు.

నిందితుడు అనవేణి మల్లేష్ (38) వాసవినగర్, వావిలాలపల్లి, కరీంనగర్‌లో నివాసముంటున్నాడు. నిందితుడు అనవేణి మల్లేష్, తన భార్య పోశవ్వ ను 2009లో వివాహం చేసుకున్నాడు. వీరికి హర్షిత్ (కొడుకు), హర్షిత (కూతురు) అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. దురదృష్టవశాత్తు, ఆ ఇద్దరు పిల్లలు చిన్న వయస్సులోనే మానసిక, శారీరక అంగవైకల్యంతో బాధపడుతున్నారు. వైద్య చికిత్స కోసం నిలోఫర్, ఉస్మానియా, నిమ్స్, నేషనల్ హ్యాండీక్యాప్డ్ హాస్పిటల్ (బోయినపల్లి), కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రులు, తిరుపతి బర్డ్స్ మరియు స్విమ్స్ వంటి అనేక ఆసుపత్రులలో పరీక్షలు చేయించినా, పిల్లల పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. స్విమ్స్ వైద్యులు పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై అడ్డు తొలగించుకోవాలని భావించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.

ఈ నెల 15 న మధ్యాహ్నం నిందితుడి భార్య శనివారం మార్కెట్‌కు వెళ్లిన సమయంలో, మొదట కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా, వారు నిరాకరించడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. అనంతరం, నిందితుడు ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలుగా చేసి, వాటిని ఉపయోగించి కూతురు (హర్షిత) , కొడుకు (హర్షిత్) మెడకు ఉరి వేసినట్లు విచారణలో అంగీకరించాడు. ఈ ఘటనలో కూతురు మరణించగా, కొడుకుపై హత్యాయత్నం జరిగింది. హత్య అనంతరం, నిందితుడు టవల్ ముక్కలను బయట పారవేసి ఇంటినుంచి పారిపోయాడు. మూడు రోజులపాటు తప్పించుకు తిరిగిన నిందితుడు మంచిర్యాల వెళ్లే గ్రామంలో కరీంనగర్ బస్టాండ్‌లో పట్టుపడ్డాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి తెలిపారు.

# 'సంధ్య' అక్రమ నిర్మాణాలపై మళ్లీ హైడ్రా చర్యలు

## ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో రహదారులను ఆక్రమించి చేపట్టిన భవనాల కూల్చివేత

## హైకోర్టు ఆదేశాలతో కదలిన అధికారులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 17, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని సంధ్య కన్‌స్ట్రక్షన్స్ అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు మరోసారి యాక్షన్‌కు దిగారు. ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో రహదారులు, పార్కులను ఆక్రమించి సంధ్య కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టిన నిర్మాణాలను మొత్తం నేలమట్టం చేశారు. గత మే 7వ తేదీన ఓ సారి సంధ్య అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టగా, మరోసారి సంధ్య శ్రీధర్‌రావు అక్రమ నిర్మాణాలను కొనసాగించాడు. దీంతో ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సోమవారం మరోసారి కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో కొనసాగుతున్న ఓ నాలుగంతస్థుల భవనం, ఫుడ్‌కోర్టు, నిర్మాణంలో ఉన్న భవనాల స్లాబ్‌లు, సెల్లార్ స్లాబ్‌లు, ఫుడ్ స్టాళ్లను, పెట్రోలు బంకును పాక్షికంగా కూల్చివేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నెంబరు 124,125లలో 1981వ సంవత్సరంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కోఆపరేటీవ్ హౌజింగ్ సొసైటీ లేఅవుట్‌ను చేశారు. ఇందులో మొత్తం 162 ప్లాట్లు చేసి ఎఫ్‌సిఐలో పనిచేస్తున్న ఉద్యోగులకు కేటాయించారు. అనంతర కాలంలో పలువురు ఉద్యోగులు ఇతరులకు ఈ ప్లాట్లను విక్రయించారు. కాగా ఈ లేఅవుట్‌ను ఆనుకొని సంధ్య కన్వెన్షన్ ఉండగా, సంధ్య కన్వెన్షన్ ఎండి సరనాల శ్రీధర్‌రావు చూపు లేఅవుట్ మీద పడింది. త్రిపుల్ ఐటి చౌరస్తా పక్కన ఉన్న ఈ లేఅవుట్ హాట్‌కేక్ కావడంతో శ్రీధర్‌రావు లేఅవుట్ మొత్తం హస్తగతం చేసుకునే ప్రణాళికకు తెరలేపాడు. ఇందులో భాగంగా కొన్ని ప్లాట్లను కొనుగోలు చేసి, వాటి లేఅవుట్‌లో ఉన్న హద్దులను మొత్తం చెరిపేశాడు. శ్రీధర్‌రావు బాధలు భరించలేక కొంతమంది ఉద్యోగులు అతనికే తమ ప్లాట్లను విక్రయించారు. ఈ విధంగా మొత్తం 119ప్లాట్లను శ్రీధర్‌రావు కొనుగోలు చేయగా, మరో 43ప్లాట్లు యజమానుల వద్ద ఉన్నాయి. కాగా అత్యధిక ప్లాట్లను కొనుగోలు చేసిన శ్రీధర్‌రావు లేఅవుట్ రూపురేఖలు మొత్తం మార్చివేశాడు. లేఅవుట్‌లో ఉన్న రహదారులు, పార్కులను కబ్జా చేసి వాటిలో భవనాలు నిర్మించాడు. దీంతో ప్లాట్ల యజమానులకు తమ ప్లాట్ ఎక్కడుందో, ప్లాట్లకు వెళ్లే దారి సైతం లేక ఇబ్బందులు పడ్డారు. దీనిపై అధికారులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. కాగా శ్రీధర్‌రావు అరాచకాలపై ప్లాట్ల యజమానులు గతంలో హైడ్రాను ఆశ్రయించగా, గత మే 7వ తేదీన హైడ్రా అధికారులు ఎఫ్‌సిఐ లేఅవుట్‌లోని పలు నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు లేఅవుట్‌లో ఉన్న 40ఫీట్లు, 20 ఫీట్ల రహదారులకు మార్కింగ్ చేశారు. కాగా అనంతర కాలంలో ప్లాట్ల యజమానులు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా, శ్రీధర్‌రావు తన అనుచరులతో దాడులు చేస్తూ బయపెట్టడంతో పాటు మరోసారి నిర్మాణాలను కొనసాగించ సాగాడు. దీంతో ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం హైడ్రా అధికారులు మరోసారి ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. లేఅవుట్‌లోని 40 అడుగుల రోడ్డును ఆక్రమించి చేపట్టిన 4 అంతస్థుల భవనాన్ని, భారీ ఫుడ్ కోర్టును, ప్రధాన రహదారి మీద ఉన్న పెట్రోలు బంకును పాక్షికంగా, 25 అడుగుల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన 40 ఫుడ్ కంటైనర్లను, ఓ ఆసుపత్రి కోసం నిర్మిస్తున్న భవనం స్లాబ్‌లను, ఆర్చ్‌లను కూల్చివేశారు. ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో రహదారులను పూర్తిగా పునరుద్ధరిస్తామని హైడ్రా అధికారులు తెలిపారు.

**ప్లాట్ల వద్దకు వెళ్లేందుకు వస్తే దాడులు : నటి రమ్యశ్రీ**

ఎఫ్‌సిఐ లేఅవుట్‌లోని తమ ప్లాటు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే తమమీద శ్రీధర్‌రావు అనుచరులు గతంలో దాడులకు పాల్పడ్డారని నటి రమ్యశ్రీ వాపోయింది. తాను 1995లో ఈ లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేశానని, అనంతర కాలంలో ప్లాట్‌కు వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో అధికారులకు పిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఎఫ్‌సిఐ లేఅవుట్‌లో తమ ప్లాటు ఎక్కడ ఉందో తెల్చుకోలేని విధంగా రహదారుల కబ్జా జరిగిందని పలువురు యజమానులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు రహదారులను పునర్నిర్మించి, తమ ప్లాట్లను రక్షించాలని కోరారు.



రహదారిని ఆ క్రమించి చేపట్టిన భారీ భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

# 'పాలేరు'ను పరిశీలించిన ఆనకట్ట భద్రతా నిపుణుల బృందం

## ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం

**కూసుమంచి, నవంబరు 17, ప్రభాతవార్త :** పాలేరు రిజర్వాయర్ ఆనకట్టను, క్రస్ట్ గేట్లను, డ్యాంను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ టీం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు డ్యాం గట్టితనం, మట్టి కట్టను, గేట్లను పరిశీలించి తుది నివేదికను ప్రభు త్వానికి అందజేయ నున్నట్లు ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సం దర్భంగా ఆనకట్ట భద్రతా నిపుణులు అశోక్ కుమార్ గంజు మాట్లాడుతూ 2021లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పాలసీ కాల పరిమితి ముగిసినందున డ్యాం కు సంబంధించి నాణ్యతను పరి శీలించేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న, గతంలో పనిచేసి రిటైర్డ్ అయిన సభ్యులతో ఏర్పాటు చేయబడిన టీం సభ్యుల సమక్షంలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఏమైనా లోపాలు ఉంటే టీం సభ్యులు అందజేసిన సమాచారం నుంచి ప్రభుత్వం తక్షణం నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తుందని తెలిపారు. ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్యాం పరిరక్షణకోసం నిపుణులైన ఇంజనీర్ల డ్యాం పటిష్టతను ముందస్తుగా అంచనా వేసేందుకే ఈ పర్యటన అని తెలిపారు. ఈ టీంలో సీడబ్ల్యూసీ సభ్యులు, రిటైర్డ్ సీఎస్సీ, సీనియర్ జియాలజిస్ట్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆనకట్ట భద్రతా నిపుణులు అశోక్ కుమార్ గంజు ఛైర్మన్, పీ రామరాజు మెంబర్, ఎం రాజు, కే సత్యనారాయణ, డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎస్ఈ సారంగం, డీఈ సతీష్, ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఈఈ రమేష్, డీఈ రత్నకుమారి, జేఈ శేఖర్, రమాదేవి పాల్గొన్నారు.



# ఇన్నోవా కారులోనే రాజశేఖర్ హత్య!

నవాబుపేట అటవీప్రాంతంలో శవదహనం

రాజశేఖర్ హత్య కేసులో కీలక ఆధారాలను సేకరించిన షాద్‌నగర్ పోలీసులు

ఏడుగురు నిందితుల అరెస్ట్, ఒకరు పరార్

షాద్‌నగర్ పోలీసుల అదుపులో వాహనం

హత్య కేసులో ప్రధాన నిందితుడు వెంకటేష్ వద్ద 'మీడియా ప్రెస్ ఐడికార్డు'

ప్లాస్టిక్ డబ్బాలో ఆరు లీటర్ల పెట్రోల్, నైలాన్‌తాడు కొనుగోలు చేసిన నిందితుడు





మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి లక్ష్మీ నారాయణ

**షాద్‌నగర్, నవంబరు 17, ప్రభాతవార్త :** దళిత యువకుడు రాజశేఖర్ కిడ్నాప్ హత్య ఉదాంతంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు కేసులో పురోగతి సాధించారు. రాజశేఖర్ ను హతమార్చి శవాన్ని దహనం చేసిన ఘటనలో పోలీసులు ఎనిమిది మందిని హంతకులుగా గుర్తించారు. ఇందులో సోమవారం ఏడు మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ లక్ష్మీనారాయణ, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎర్ర రాజశేఖర్ ను హత్య చేసిన వారిలో ప్రధాన నిందితుడు ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కాగుల వెంకటేష్, మరో ట్రాక్టర్ డ్రైవర్ పత్తి శీను, వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన వడ్డే నర్సింలు, బాలనగర్ మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన గణేష్, మొయినాబాద్ మండలం నజీబ్ నగర్ గ్రామానికి చెందిన సోమ సురేష్ అలియాస్ సోమచంద్ కుమార్, రంగంపల్లి గ్రామానికి చెందిన బిజ్జు రాఘవేందర్, మరో డీసెంట్ డ్రైవర్ ఆవుల శ్రీకాంత్, కానుగుల రాములు మొత్తం ఎనిమిది మంది ఈ హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు ధృవీకరించారు. ఇందులో గణేష్ పరారీలో ఉండగా మిగతా ఏడు మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. ఈనెల 12వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో హత్యకు గురైన రాజశేఖర్ భార్య ఎర్రవాణి వెంకటేష్ అలియాస్ వెంకటయ్య అనే వ్యక్తి మరో ముగ్గురు కలిసి తమ ఇంటి దగ్గరకు వచ్చి తన భర్తను ఇంటి నుండి బయటకు పిలిచి మాట్లాడదామని చెప్పి తనకు సమాచారం ఇవ్వకుండా అతన్ని తీసుకువెళ్లిపోయారని కిడ్నాప్ చేశారని ఆమె పోలీసులకు పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో తన భర్త సోదరుడు చంద్ర శేఖర్ భవాని ఇరువురి మధ్య ప్రేమ వ్యవహారంలో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయిందని తన మరిది తక్కువ కులం వాడు కావడంతో ఇది చూసి భవాని తండ్రి వెంకటయ్య సిగ్గుపడ్డాడని రాజశేఖర్ చంద్రశేఖర్ కు మద్దతు ఇస్తున్నాడని అతని ఎలాగైనా చంపాలని వెంకటేష్ నిర్ణయించుకున్నాడని తెలిపారు. రాజశేఖర్ ను ఈనెల 12వ తేదీన కిడ్నాప్ చేసి ఇన్నోవా కార్ లో ఎక్కించుకొని అన్నారం జంక్షన్ వైపు వెళ్ళిపోయారు. ఇన్నోవా కారులోనే రాజశేఖర్ గొంతు కోసి చంపారు మెడకు తీసుకువచ్చిన నైలాన్ తాడుతో రెండువైపులాగా ఈ సమయంలో కొందరు అతని కాళ్ళను పట్టుకొని హత్యకు సహకరించారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఇన్నోవా కారులో రామేశ్వరం వైపు వెళ్లి నవాబుపేట సరిహద్దులకు వెళ్లి ఒక నిర్మానుష ప్రదేశంలో రాజశేఖర్ మృతదేహాన్ని దించి తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ క్యాన్లు 6 లీటర్ల పెట్రోలు మృతదేహం పై పోసి అగ్గిపెట్టతో నిప్పంటించినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో పోలీసులు ఏడు మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలిస్తున్నట్లు ప్రకటించగా వీరి వద్ద రెండు బైకులు 2 కార్లు అదేవిధంగా 6500 రూపాయల నగదు, ఒక సెల్ ఫోన్ ఇన్నోవా కార్ ఆర్ సి వెంకటేష్ కు సంబంధించిన ఒక ప్రెస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు. షాద్ నగర్ ఎసిపి ఎస్ లక్ష్మీనారాయణ, సీఐ విజయకుమార్, ఎస్ఐ శరత్‌కుమార్ పోలీసు సిబ్బంది తదితరులు ఈ కేసులో నిందితుల గుర్తింపు కోసం చురుగ్గా పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు వీరికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తగిన రివార్డులను అందజేస్తారని వారు పేర్కొన్నారు.

# ఢిల్లీ కారుబాంబు పేలుడు నిందితులు తెలంగాణ యాసలో కోడ్‌నేమ్‌లు వాడారు

## బిర్యాని, దావత్‌ల పేర్లతో పేలుడుకు లింకులున్నట్లు గుర్తింపు

## రాష్ట్రానికి సంబంధం ఉన్నట్లు లభించని ఆధారాలు

**హైదరాబాద్, నవంబరు 17, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ కారు బాంబుపేలుడు ఘటనలో అరెస్టయిన నిందితులు తెలంగాణ యాసలో వాడిన కోడ్ భాషలు మరిన్ని సంచలనాలకు తావిచ్చింది. ఈ పేలుడుకు కారకులైన నిందితులు టెలిగ్రామ్‌లో బిర్యాని, ధావత్ వంటి కోడ్ నేమ్‌లు వాడినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ తరహా భాష ఒక్క తెలంగాణలోనే ఎక్కువగా వాడుతుండడంతో ఢిల్లీ పేలుడుకు తెలంగా ణకు వున్న లింకులపై దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ ఘటనకు తెలంగాణకు ఎలాంటి సంబంధం వున్నట్లు పోలీ సులకు ఆధారాలు లభించలేదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న జరిగిన కారుబాంబు పేలుడుపై విచారిస్తున్న పోలీసులకు రోజు కో ఆధారాలు లభిస్తున్నాయి. ఈ దాడి ఐఎస్ఐ ఉగ్రవాది జరిగిన ఆత్మాహుతి దాడిగా నిర్ధారణ అవడం తెలిసిందే. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ ఉమర్ నబీ అనే ఉగ్రవాది మానవ బాంబుగా మారి కారు బాంబు పేలుడుకు పాల్పడడం విదితమే. ఈ ఘటనలో బాంబర్ సహా 12 మంది మరణించగా మరో 25 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో నింది తులు ఇద్దరు వైద్యులుగా వుండగా వారు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్శిటీ ఉద్యోగులని తేలడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. వీరితోపాటు కాశ్మీర్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న హర్యానాకు చెందిన ప్రియాంక శర్మకు వీరితో సంబంధాలున్నట్లు తాజాగా వెలుగు చూడగా ఆమెను అదుపులోకి తీసుకుని విచా రిస్తున్నారు. కాగా కారు బాంబు పేలుడులో నిందితులుగా వున్న నలుగురితో పాటు మరో పది మంది టెలిగ్రామ్‌లో కోడ్ భాషలోనే మాట్లాడేవారని పోలీసుల విచారణలో తేలింది. ఈ కోడ్ భాషలో ఎక్కువగా బిర్యాని, ధావత్ అనే పదాలు ఎక్కువగా వుండడంతో దీనివెనుక మతలబు ఏమిటనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు తాముండే ప్రాంతాలలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడి హైదరాబాద్‌లో రహస్యంగా జీవిస్తున్న పలు ఘటనలు వెలుగు చూశాయి. ఇందులో ఐసిస్ లింకులున్న వారు పలువురు వున్నారు. ఐసిస్‌లో చేరేందుకు కొందరు సిరియా వెళ్లగా మరికొందరిని విమానాశ్రయాలలోనే పోలీసులు పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబాలకు అప్పగించారు. మొత్తం మీద తెలంగాణలో ఉగ్రవాద కార్యకాలాపాలకు పాల్పడే వారిని నివారిం చడంలో పోలీసుల వ్యూహాలు చాలావరకు ఫలించాయి. ఈ క్రమంలో ఢిల్లీ పేలుడు కేసులో నిందితులు బిర్యాని, ధావత్ పేరిట కోడ్ నేంలు వాడ డం వెనుక గల కారణాలను ఢిల్లీ పోలీసులతో పాటు హైదరాబాద్ పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు. ఢిల్లీ పేలుడులో ఇక్కడి వారి హస్తం ఏమైనా ఉందా? ఒకవేళ నిందితులకు సహకరించారా? అనే కోణంలో విచారణ జరుగుతోంది.



ఆందోళన ప్రాంతం వద్ద ట్రాన్స్‌జెండర్లకు అంటుకున్న మంటలు, భయంతో పరుగులు తీస్తున్న స్థానికులు

# ట్రాన్స్‌జెండర్ల మధ్య 'భగ్గుమన్న' వివాదం

## పెట్రోల్ పోసుకొని బోరబండ బస్టాప్‌లో ఆందోళన

## నిప్పంటుకొని పలువురికి గాయాలు

## ముగ్గురి పరిస్థితి విషమం, ఇన్‌స్పెక్టర్, మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 17, ప్రభాతవార్త:** ట్రాన్స్‌జెండర్ల గ్రూపు మధ్య తలెత్తిన వివాదం బోరబండలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పెట్రోల్ పోసుకొని చేపట్టిన ఆందోళనలో ఆకస్మాత్తుగా నిప్పు అంటుకోవడంతో ఏడుగురు ట్రాన్స్‌జెండర్లతోపాటు బోరబండ ఇన్‌స్పెక్టర్, ఒక మహిళా కానిస్టేబుల్ గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారింది. బోరబండ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. బోరబండలో నివసించే స్వప్న అనే ట్రాన్స్‌జెండర్ గ్యాంగ్‌కు, మరో ప్రాంతంలో నివసించే మోనాలిసా గ్యాంగ్‌కు కొద్ది రోజుల క్రితం ఒక బర్త్‌డే వేడుకలో గొడవ జరిగింది. ఇదే విషయమై మా ట్లాడేందుకు వెళ్లిన స్వప్న గ్యాంగ్ సభ్యులపై మోనాలిసా దాడికి పాల్పడింది. దీంతో స్వప్న వర్గంలోని సభ్యులపై మోనాలిసాపై సైబరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే మోనాలిసాపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం మధ్యా హ్నం 3.45 దాదాపు 50 మందికిపైగా బోరబండ బస్టాప్ వద్దకు చేరుకున్నారు. తొలుత ముగ్గురు, నలుగురు పెట్రోల్ పోసుకొని ఆందోళనకు దిగారు. అక్కడ బైఠాయించారు. దీంతో బోరబండ పోలీసులు సైతం అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటపాటు పోలీసులు వారిని బతిమలాడారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు సామాజిక మాధ్యమాల్లో తమ ఆందోళన గురించి పోస్ట్ చేయడంతో దాదాపు పది మంది ట్రాన్స్‌జెండర్లు అక్కడికి చేరుకున్నారు. దాదాపు పది మంది వరకు అక్కడ పెట్రోల్ పోసుకొని ఆందోళనను ఉదృతం చేశారు. మోనాలిసా ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను పట్టుకొని ఆందోళను దిగారు. అదే సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఒకరి నుంచి ఒకరికి మంటలు అంటుకున్నాయి. మంటల తాకిడికి ట్రాన్స్‌జెండర్లు పక్కనే ఉన్న స్థానికుల మీదకు వెళ్లడంతో స్థానికులు అక్కడ పరుగులు తీశారు. కొందరు కిందపడ్డారు. మరోవైపు అక్కడే ఉన్న బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేం దర్, మరో మహిళా కానిస్టేబుల్‌కు సైతం మంటలు అంటుకున్నాయి. స్థానికు లు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ సంఘటనలో అఫ్సానా, హీనా, నవనీ తలకు తీవ్రగాయాలయ్యాయి. టీనా సూనర్, ప్రాచి, నవ్యశ్రీ తది తరులు సైతం గాయపడ్డారు. కాగా వీరందరిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రితోపాటు గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ సురేందర్, మహి ళా కానిస్టేబుల్‌కు సైతం స్వల్పంగా గాయాలు కావడంతో వారికి ప్రాథ మిక చికిత్సను అందించారు. విషయం తెలుసుకున్న అదనపు డీసీపీ గోవర్ధన్, ఏసీపీ మురళీకృష్ణ, ఇన్స్‌పెక్టర్లు ప్రభాకర్, త్రినాథ్‌రెడ్డి, డిఐ సైదులు, ఎస్సైలు అక్కడిడి చేరుకున్నారు. సంఘటనపై బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నిర్ణయం మీదా! మాదా?

>> సనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వచ్చే వారం లోపలే నిర్ణయం తీసుకోవాలి, లేదంటే స్పీకర్ కాంటెంప్ట్‌కు సిద్ధం కావాలని స్పష్టం చేసింది. న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలని సిజెఐ ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. దీంతో, స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం, రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టు ధిక్కార పిటిషన్‌పై స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలు, పరిస్థితుల వల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండు నెలలు సమయం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. అలాగే మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను స్పికర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఉల్లంఘించారని ఆయనపై వెంటనే కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనందున నేరుగా న్యాయస్థానమే తమ పిటిషన్లపై విచారణ చేపట్టి తుది నిర్ణయం వెలువరించాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. ఈ క్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం అందరి తరఫున వాదనలు స్వీకరించి స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది

**పార్టీ మారిన ఎమ్మెల్యే వీరే :** దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), కాలే యాదయ్య (చెవేళ్ల), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సు వాడ), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), డాక్టర్ సంజయ్ (జగిత్యాల) బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరారు.

**రాజీనామాకు సిద్ధంగా దానం! :** ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ రాజీనామా చేస్తారన్న ఊహాగానాలు ఎక్కువగా వస్తున్నాయి. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఘన విజయంతో ఉపఎన్నిక వచ్చినా ఎదుర్కొంటామన్న ఆత్మవిశ్వాసం అక్కడి కాంగ్రెస్ కార్యకర్తల్లో పెరిగింది. ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం రాజీనామాకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఇటీవల కోల్‌కతా హైకోర్టు పశ్చిమబెంగాల్‌లో ఓ ఎమ్మెల్యే పార్టీ మారడంతో ఆయనపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. తెలంగాణలోనూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు పడే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

**మరో రెండు బైపోల్స్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయకేతనం ఎగుర వేయడంతో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా మరింత పట్టు బిగించినట్లైంది. జూబ్లీ ఉత్సాహంతో తన బలాన్ని పెంచుకోవాలనుకంటున్నది. ఉప ఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. ఇదే అదనుగా తీసుకుని ప్రతిపక్షాలను ఎండగడుతూ, తమ బలాన్ని పెంచుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా భావిస్తున్నది. ఇందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలకు, జిహెచ్‌ఎంసి ఎన్నికలకు వెళ్ళడమే కాకుండా అసెంబ్లీలోనూ సంఖ్యా బలం పెంచుకోవాలనుకుంటున్నది. ఈ మేరకు ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఎంఎల్ఏ దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి చేత శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయించి తిరిగి ప్రజా తీర్పుకు వెళ్ళి అసెంబ్లీలో బలాన్ని పెంచుకోవాలను కంటున్నట్లు సమాచారం.

# భారత్‌కు విషమ పరీక్ష





## ఈ నెల 18న ఒమన్‌తో చావో రేవో

## సెమీ ఫైనల్లోకి పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** ఇండియాపై విజయం సాధించడంతో పాకిస్తాన్ జట్టు ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 టోర్నమెంట్‌లో సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. మరోవైపు ఇండియా జట్టు టోర్నమెంట్‌లో నిలబడాలంటే తమ తదుపరి మ్యాచ్‌లో తప్పనిసరిగా విజయం సాధించాల్సి ఉంది. గ్రూప్ బి నుంచి రెండో సెమీఫైనల్ స్థానం కోసం ప్రస్తుతం ఇండియా, ఒమన్, యుఎఇ పోటీపడుతున్నాయి. ఇండియా ఈనెల 18న ఒమన్‌తో కీలకమైన మ్యాచ్ ఆడనుంది. సెమీ ఫైనల్స్‌కు చేరుకోవాలంటే టీమిండియాకు ఇది తప్పక గెలవాల్సిన మ్యాచ్. ఈ మ్యాచ్ ఫలితం, అలాగే యుఎఇ ప్రదర్శన గ్రూప్ బి నుంచి రెండో అర్హత పొందే జట్టును నిర్ణయిస్తాయి. ఇక ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య ఆరో మ్యాచ్ జరిగింది. దోహాలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండియాజట్టు పాకిస్తాన్ చేతిలో ఓటమిని చవిచూసింది. ఈమ్యాచ్‌లో పాకిస్తాన్ 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అవుటయ్యాడు. ఆ తర్వాత వైభవ్ సూర్యవంశీ, నమన్ ధీర్ కలిసి రెండో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వైభవ్ తన అర్థ శతకాన్ని కొద్దిలో చేజార్చుకున్నాడు. వైభవ్ 45 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఒక దశలో 101/3గా ఉన్న స్కోరు, చివరి 7 వికెట్లకు కేవలం 35 పరుగులు మాత్రమేజోడించి, 136 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ కేవలం 2 వికెట్లు కోల్పోయి 14వ ఓవర్‌లోనే సులభంగా లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయం నమోదు చేసింది. పాక్ ఓపెనర్ మాజ్ సాదఖత్ అజేయ అర్ధశతకంతో విజృంభించడంతో భారత్ 8 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. 137 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన పాకిస్తాన్ తరఫున ఓపెనర్ మాజ్ సాదఖత్ కేవలం 47బంతుల్లోనే 79 పరుగులతో అజేయంగా నిలిచాడు. మాజ్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా పాకిస్తాన్ జట్టు లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించింది.



## వింబుల్డన్ ఛాంపియన్‌గా సిన్నర్

### అల్కరాజ్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఎటిపి వింబుల్డన్ ఛాంపియన్‌గా ఇటాలియన్ జానిక్ సిన్నర్ నిలిచాడు. అల్కరాజ్‌పై 7-6(4), 7-5 తేడాతో విజయం సాధించాడు. ఉత్కంఠభరితమైన సీజన్‌ను అత్యుత్తమ రీతిలో ముగించిన జానిక్ సిన్నర్ తన ఎటిపి ఫైనల్స్ టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి ప్రత్యర్థి కార్లోస్ అల్కరాజ్‌ను వరుస సెట్లలో ఓడించాడు. పురుషుల టెన్నిస్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఈ సంవత్సరం జరిగిన ఆరో సమావేశంలో ఫైనల్స్ ట్రోఫీ కోసం రెండవ ర్యాంక్‌లో ఉన్న సిన్నర్ అగ్రస్థానంలో ఉన్న కార్లోస్ అల్కరాజ్‌ను ఖంగుతినిపించాడు. వింబుల్డన్ ఫైనల్‌లో స్పానియార్డ్‌ను ఓడించిన తర్వాత ఈ సంవత్సరం అల్కరాజ్‌పై తన రెండవ విజయంతో సిన్నర్ తన సొంత ఇటాలియన్ అభిమానుల ముందు టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. కాగా అల్కరాజ్ ఇప్పటికే సంవత్సరాంతపు నంబర్1 ర్యాంకింగ్‌ను దక్కించుకున్నాడు. ఈ సంవత్సరంలోని టాప్ ఎనిమిది మంది ఆటగాళ్ల కోసం జరిగే ఈవెంట్‌లో తన మొదటి ఫైనల్‌కు పోటీపడుతున్నాడు. అల్కరాజ్ ఇప్పటికీ సిన్నర్‌తో తనకెరీర్ సమావేశాలలో 10-6తో ముందంజలో ఉన్నాడు. గత మూడు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో సిన్నర్ మరియు అల్కరాజ్ తలపడ్డారు. ఐదవ సెట్ టైబ్రేకర్‌లో సిన్నర్‌ను ఓడించి అల్కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుచుకున్నాడు; వింబుల్డన్‌లో సిన్నర్ కొంతవరకు ప్రతీకారంతీర్చుకున్నాడు; తర్వాత అల్కరాజ్‌మళ్లీ యుఎస్ ఓపెన్‌లో అగ్రస్థానంలో నిలిచాడు.

### టోక్యో డెఫ్లింపిక్స్ షూటింగ్‌లో..

## అనూయ, ప్రాంజలికి స్వర్ణం, కాంస్యం



### అభినవ్‌కు రజతం

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్ 2025, ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో భారతదేశానికి మూడు పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో అనూయా ప్రసాద్, ప్రాంజలి ధుమాల్ అగ్రస్థానాలను కైవసం చేసుకుని స్వర్ణం, కాంస్యం సాధించగా, అభినవ్ దేశ్వాల్‌కు రజతందక్కింది. సోమవారం జపాన్‌లోని టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత షూటర్ అనయ ప్రపంచ రికార్డుతో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అనయ 241.1 పాయింట్లతో స్వర్ణం గెలిచి భారత్ నుంచి తొలి మహిళా షూటర్‌గా నిలిచింది. అలాగే ప్రాంజలి 236.8 పాయింట్లతో రజతంతో సరిపెట్టుకోగా, ఇరాన్‌కు చెందిన మహలా సమీ 215.5 పాయింట్లతో కాంస్య పతకం సాధించడంతో భారత్ డబుల్ పోడియంను గెలుచుకుంది. అంతకుముందు అర్హత పోటీలో, ప్రాంజలి 572 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి అర్హత ప్రపంచ రికార్డును కలిగి ఉంది. అనయ 564 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. అలాగే అభినవ్ దేశ్వాల్ కు రజతం లభించింది. ఇప్పటికే జపాన్‌లోని టోక్యోలో జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో అభినవ్ దేశ్వాల్ ప్రపంచ రికార్డుతో ఎయిర్ రైఫిల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడం ద్వారా భారతదేశానికి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. డెఫ్లింపిక్స్‌లో అభినవ్‌కు ఇది రెండో రజతం. ఇక పోటీలో ఉన్న మరో భారతీయుడు రుదార్ వినోద్ కుమార్ 549 పాయింట్లతో 12వ స్థానంలో నిలిచాడు. ఫలితంగా డెఫ్లింపిక్స్‌లో భారత్‌కు ఇప్పటివరకు 1 స్వర్ణం, 2 రజతం మరియు ఒక కాంస్యంతో సహా నాలుగు పతకాలను గెలుచుకుంది.



## ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్ విక్టరీ

### 7 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. క్రైస్ట్ చర్చ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో విండీస్‌పై 7 పరుగుల తేడాతో కివీస్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 269 పరుగులు చేసింది. బ్లాక్ క్యాప్స్ బ్యాటర్లలో డారిల్ మిచెల్ (119) అద్భుత సెంచరీతో చెలరేగగా, డెవాన్ కాన్వే (49) అర్థ శతకంతో రాణించాడు. టాపార్డర్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర (4), విల్ యంగ్ (0) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ 3 వికెట్లు, మాథ్యూ ఫోర్డ్ 2, గ్రీవ్స్, చెజ్ తలా ఒక వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 262 పరుగులే చేయగలిగింది. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (55), గ్రీవ్స్ (38), కెవేటన్ షై హోప్ (37), కిసి కార్టి (32), అతనెజ్ (29), రొమారియో షెఫర్డ్ (26) సమిష్టిగా రాణించడంతో గెలిచే స్థితిలో నిలిచింది. కానీ చివరి 12 బంతుల్లో 32 పరుగుల సమీకరణాన్ని సాధించలేకపోయింది. చివరి రెండు ఓవర్లలో కరేబియన్ జట్టు 24 పరుగులు సాధించి ఓటమి పాలైంది. జెమిసన్ కీలక వికెట్లు పడగొట్టగా, హెన్రీ, ఫాక్స్, సాన్‌ట్నర్ తలా ఒక వికెట్ తీశారు.

### ఉమెన్స్ ఛాంపియన్స్..

## చరిత్ర సృష్టించిన ఈస్ట్ బెంగాల్


### ఖాటూన్‌పై 3-1తో విజయం



**న్యూఢిల్లీ:** ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్ 2025లో తొలిసారి భారత్ మహిళల జట్టుగా తూర్పు బెంగాల్ సంచలన రికార్డు నమోదు చేసింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్లఓ బామ్ ఖాటూన్‌పై 3-1 విజయంతో తూర్పు బెంగాల్ విజయం సాధించింది. దీంతో ఎఎఫ్‌సి ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్‌లో మెయిన్‌డ్రా మ్యాచ్‌ను గెలిచిన తొలి భారత జట్టుగా తూర్పు బెంగాల్ నిలిచింది. రెడ్ అండ్ గోల్డ్ బ్రిగేడ్ ఇండియన్ ఉమెన్స్ లీగ్ ఛాంపియన్లుగా పోటీలోకి ప్రవేశించింది. 4వ నిమిషం ప్రారంభంలోనే తూర్పు బెంగాల్ గోల్ చేసింది. టాలిస్మాన్ ఫజిలా ఇక్వాపుట్ కొట్టిన బ్లాక్ షాట్ తర్వాత శిల్కీ దేవి హేమామ్ రీబౌండ్‌ను సద్వినియోగం చేసుకుని ఓపెనర్‌ను గోల్‌గా మార్చింది. క్రియేటర్ నుండి ఫినిషర్‌గా మారిన ఫజిలా ఇక్వాపుట్, బామ్ ఖాటూన్ డిఫెన్స్‌ను దాటి క్లినికల్ లో షాట్ వేసి తూర్పు బెంగాల్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. రెండవ అర్ధభాగంలో బామ్ ఖాటూన్ 52వ నిమిషంలో మోనా హమోడి పెనాల్టీని గోల్‌గా మార్చడం ద్వారా ఒక గోల్‌ను వెనక్కి తీసుకుంది. భారత జట్టు అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. చివరకు 88వ నిమిషంలో భీమా గోల్ వచ్చింది, ఈ 3-1 విజయంతో, తూర్పు బెంగాల్ తమ తినీది ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో లాభాల దూకుడు..

**ముంబయి, నవంబరు 17:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజు కూడా లాభాల జోరును కొనసాగించాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, దేశీయంగా కొనుగోళ్ల మద్దతుతో సూచీలు సోమవారం లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 388.17 పాయింట్లు పెరిగి 84,950.95 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ సూచీ కూడా 103.40 పాయింట్లు లాభపడి 26,013.45 వద్ద ట్రేడింగ్ ముగించింది. నిఫ్టీకి కీలకమైన సైకలాజికల్ మార్కు కావడం గమనార్హం. సోమవారం ఉదయం సెన్సెక్స్ 84,700.50 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైంది. ట్రేడింగ్ సెషన్ మొత్తం సానుకూలంగానే సాగింది. ఇంట్రాడేలో 84,988.09 వద్ద గరిష్ఠ స్థాయిని, 84,581.08 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. విశ్లేషకుల



ప్రకారం, మిడ్‌క్యాప్ కంపెనీలు రెండో త్రైమాసికంలో అంచనాలకు మించి మంచి ఫలితాలను ప్రకటించడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. ఇది మార్కెట్ వృద్ధికి దోహదపడింది. భవిష్యత్తులో కీలకమైన వాణిజ్య ఒప్పందాలు కుదిరితే మార్కెట్ మరింత ముందుకు దూసుకెళ్లే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. సెన్సెక్స్ 30 షేర్లలో మారుతీ సుజుకి, కొటక్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, టైటన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ నష్టాలను చవిచూశాయి. దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది.

## అణువిద్యుత్‌రంగంలోకి ఎన్టీపీసీ మెగా ఎంట్రీ

**న్యూఢిల్లీ, నవంబరు 17:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) అణు విద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తోంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 700, 1000, 1600 మెగావాట్ల సామర్థ్యంతో అణు విద్యుత్ ప్రాజెక్టులను స్థాపించడానికి సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లు సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) అనుమతించిన ప్రాంతాల్లోనే ఈ ప్లాంట్లను నిర్మించనున్నారు. 2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా, ఎన్‌టీపీసీ 30 గిగావాట్ల వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక గిగావాట్ సామర్థ్యం గల అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.15,000 కోట్ల నుంచి




రూ.20,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. ప్రాజెక్టు ప్రణాళిక దశ నుంచి ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడేళ్ల సమయం పడుతుందని సంస్థ భావిస్తోంది. ఈ ప్లాంట్లకు అత్యంత కీలకమైన ముడిపదార్థం యురేనియం సమీకరణపై ఎన్‌టీపీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో వాణిజ్య, సాంకేతిక ఒప్పందం కుదుర్చుకుంది. విదేశాల్లోనూ యురేనియం ఆస్తుల సమీకరణకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం ఎన్‌టీపీసీకి దేశవ్యాప్తంగా బొగ్గు, గ్యాస్, సౌర, జలవిద్యుత్ ప్లాంట్ల ద్వారా 84,848 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఇప్పటికే రాజస్థాన్‌లో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌తో కలిసి రూ.42,000 కోట్లతో ఓ అణు విద్యుత్ ప్లాంటును నిర్మిస్తోంది.

# భారీగా క్షీణించిన బిట్‌కాయిన్



**ముంబయి, నవంబరు 17:** ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సోమవారం భారీగా పతనమైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే నెలలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడటంతో, ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో బిట్‌కాయిన్ ధర ఆరు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్‌లో ఒకదశలో 92,971 డాలర్ల వద్దకు పడిపోయిన బిట్‌కాయిన్, ప్రస్తుతం 0.5శాతం నష్టంతో 95,165 డాలర్ల వద్ద కదలాడుతోంది. వారం రోజుల్లోనే బిట్‌కాయిన్ 10శాతానికి పైగా నష్టపోయింది. వరుసగా మూడోవారం కూడా నష్టాలను నమోదు చేసింది. ఈ ఏడాది ఆరంభంనుంచి సాధించిన 30శాతం లాభాలను తుడిచిపెట్టింది. అక్టోబర్‌లో 1,26,000 డాలర్ల రికార్డు స్థాయిని తాకిన ఈ క్రిప్టో కరెన్సీ, ఇప్పుడు అధికారికంగా బేర్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. బిట్‌కాయిన్‌తో పాటు ఇతర ప్రధాన కాయిన్లయిన ఇథేరియం, సొలానా, డోజీకాయిన్ కూడా నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అయితే, ఎక్స్ఆర్‌పీ మాత్రం స్వల్పంగా లాభపడింది. యూఎస్‌లో ద్రవ్యోల్బణ భయాలు మళ్లీ పెరగడం, ఫుడ్ ధరలను అదుపు చేసేందుకు సుంకాల కోతపై అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు ఇవ్వడం వంటి అంశాలు మార్కెట్‌ను ప్రభావితం చేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మడ్రెక్స్ సీఈఓ ఎదుల్ పటేల్ మాట్లాడుతూ ధర తగ్గిన ప్రతీసారి పెద్ద ఇన్వెస్టర్లు కొనుగోలు చేస్తుండటం సానుకూల అంశం. 92,700 డాలర్ల వద్ద కొత్త మద్దతువస్తోందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో లిక్విడిటీ తక్కువగా ఉందని, సంస్థాగత, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి ఆసక్తి కరువైందని పై42 సీఈఓ అవినాశ్ శేఖర్ అన్నారు.

## రూ.లక్షకోట్ల విలువ దాటేసిన స్టాక్‌బ్రోకరేజి 'గ్రో'


**ముంబయి, నవంబరు 17:** స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'గ్రో' పేరెంట్ కంపెనీ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్‌లో దూసుకెళ్తున్నాయి. గత వారంలోనే స్టాక్ మార్కెట్‌లోకి ఈ కంపెనీ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంచి లాభాలతో లిస్టింగ్ అయిన ఈ స్టాక్ వరుసగా నాలుగో రోజూ భారీ లాభాల్లో దూసుకెళ్తోంది. తమ ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈ స్టాక్ పనితీరు గమనిస్తే జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 50 ఇండెక్స్‌లో 14.66 శాతం లాభంతో రూ.170.3 వద్ద ట్రేడవుతోంది. ఈ స్టాక్ ఇంట్రాడేలో చూసుకుంటే రూ. 154.15 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ 15 శాతం మేర లాభంతో సరికొత్త 52వారాల గరిష్ఠ ధర రూ. 171.70ని తాకింది. ఆ తర్వాత కాస్త వెనక్కి తగ్గింది. 33.19కోట్ల షేర్లు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఈ స్టాక్ లిస్టింగ్ ధరనే 52 వారాల కనిష్ఠ ధరగా ఉంది. అంటే లిస్టింగ్ తర్వాత దూసుకెళ్తూనే ఉంది. ఈ స్టాక్ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ. 100 నుంచి చూసుకుంటే 70శాతం మేర లాభాలు అందించింది. అదే లిస్టింగ్ ధర రూ. 112తో పోల్చి చూస్తే 53 శాతం మేర లాభాలు అందించింది. దీంతో ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 1లక్ష కోట్ల మార్క్ దాటింది. బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ గత వారం 14 శాతం ప్రీమియంతో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయింది. ఈ ఐపీఓ ఇష్యూ ధర రూ. 100తో పోలిస్తే ఎన్ఎస్ఈలో 12 శాతం లాభంతో రూ.112 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. అదే రోజున రూ. 128.85 వద్ద ముగిసింది. ఆ తర్వాత కంపెనీ షేర్లు 53 శాతం మేర పెరిగాయి. రూ. 6,632 కోట్ల నిధులు సమీకరించే లక్ష్యంతో కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఐపీఓలో భాగంగా ప్రైస్ బ్యాండ్ రూ. 95 నుంచి రూ. 100గా నిర్ణయించారు. 17 రెట్లకు పైగా సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. 2025 జూన్ నెల నాటికి కంపెనీ 26 శాతం మేర మార్కెట్ వాటాతో ఉంది.

# కాగ్నిజెంట్ నిఘాపై ఉద్యోగుల్లో తీవ్ర నిరసన



**న్యూఢిల్లీ, నవంబరు 17:** ఐటీ దిగ్గజాలలో ఒకటైన కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగుల పని తీరును అతి సూక్ష్మ స్థాయిలో పర్యవేక్షించేందుకు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాజెక్టుల్లో పని చేసే ఐటీ ఉద్యోగులపై ప్రత్యేక నిఘా పెట్టింది. ఆయా సిబ్బంది ల్యాప్‌టాప్ కార్యకలాపాలు, మౌస్ లేదా కీబోర్డ్ కదలికలు, వారు సందర్శించే వెబ్‌సైట్లపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక ప్రోహాన్స్ వంటి వర్క్ ఫోర్స్ మేనేజ్మెంట్ సాఫ్ట్‌వేర్లను ఉపయోగిస్తోందట. ఈ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఉద్యోగుల ప్రతి కదలికపై నిఘా పెట్టే నిర్ణయం సరికాదని ఐటీ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్య ఉద్యోగుల వ్యక్తిగత గోప్యతను, స్వేచ్ఛను హరించేదిగా ఉందని, వారిపై కంపెనీకి నమ్మకం లేదని సూచించేదిగా ఉందని పేర్కొంటున్నారు. కాగ్నిజెంట్ అంతర్గత శిక్షణా మాడ్యూళ్ల ప్రకారం ఈ కొత్త నిఘా విధానం ద్వారా ఉద్యోగుల కార్యకలాపాలను కొలిచేందుకు నిర్దిష్ట ప్రమాణాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. మౌస్ లేదా కీబోర్డ్ కదలికలు లేకుండా 5 నిమిషాలు గడిస్తే ఆ ఉద్యోగి పని చేయడం లేదని పరిగణిస్తారు. అలాగే 15 నిమిషాల పాటు సిస్టమ్ టూల్స్ కదలికలు లేకపోతే సిస్టమ్‌కు దూరంగా ఇతర పనుల్లో నిమగ్నమైనట్లు గుర్తిస్తారు. ప్రోహాన్స్ సాఫ్ట్‌వేర్ వంటి వాటితో ట్రాక్ చేసిన డేటాను ఉద్యోగుల వ్యక్తిగత పనితీరు మదింపు కోసం ఉపయోగించబోమని కాగ్నిజెంట్ చెప్పినట్లు తెలుస్తోంది. మైక్రో ట్రాకింగ్ అనేది ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, ఉత్పాదకత, స్వేచ్ఛకు తీవ్రమైన నష్టం కలిగించే చర్యగా విమర్శలు వెల్లువెత్తుతున్న క్రమంలో ఈ మేరకు కంపెనీ స్పందించినట్లు సమాచారం. అయితే, కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయం వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న ఉద్యోగులు నిరంతరం తమపై ఎవరో నిఘా పెడుతున్నారనే ఒత్తిడికి లోనవుతారని ఐటీ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అస్తవ్యస్తమవుతుందని, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల మధ్య ఉన్న గీత చెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ప్రాజెక్టులు, క్రిటికల్ వెబ్‌సైట్లను ట్రాక్ చేయడం ద్వారా వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు గురవుతుందంటున్నారు. ఉద్యోగులపై నమ్మకం ఉంచకుండా కేవలం ల్యాప్ టాప్ కదలికలను బట్టి వారి పనితీరును అంచనా వేయడం అనేది కార్పొరేట్ నైతికతకు విరుద్ధమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## టిసిఎస్‌కు లేబర్ కమిషనర్ నోటీసులు..




**ముంబయి, నవంబరు 17:** ఐటీ రంగంలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు కష్టాలు ఎదురవుతున్నాయి. త్రైమాసిక ఫలితాల్ని ప్రకటించిన సమయంలో ఉద్యోగుల తొలగింపుపైనా ప్రకటనచేసింది. దాదాపు 2శాతం వరకు ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంఖ్య సుమారు 20 వేల వరకు ఉందని టెక్‌నిపుణులు అంచనావేసారు. టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య మొత్తంగా త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే 20 వేల మంది వరకు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే ఇప్పుడు ఆ సంస్థను చిక్కుల్లో పడేసింది. తమ ఉద్యోగుల తొలగింపు విధానాల కారణంగా వివాదంలో చిక్కుకుంది. ఇప్పుడు పుణె లేబర్ కమిషనర్ నుంచి టీసీఎస్‌కు సమన్లు జారీ అయ్యాయి. ఐటీ ఉద్యోగుల సంఘం అయిన నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్‌నుంచి ఎన్నో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో లేబర్ కమిషనర్ చర్య తీసుకుంది. బాధిత ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు నైట్స్ పేర్కొంది. గత కొన్నినెలలుగా టీసీఎస్ ఉద్యోగుల నుంచి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపింది. ఫిర్యాదుల్లో ప్రధాన అంశాల విషయానికి వస్తే ఆకస్మిక తొలగింపులు, బలవంతంగా రాజీనామాలు చేయించడం, చట్టబద్ధంగా రావాల్సిన బకాయిల్ని నిరాకరించడం, నియంతృత్వ విధానాలు వంటివి ఉన్నట్లు నాస్కెంట్ వివరించింది. తమకు అందిన డాక్యుమెంటేషన్‌ను సమీక్షించిన తర్వాతే అధికారులకు ఫిర్యాదులు దాఖలు చేసేందుకు ఉద్యోగులకు సహాయం చేసినట్లు నైట్స్ స్పష్టం చేసింది. తాజా పరిణామం ఐటీ రంగంలోని ఉద్యోగుల హక్కులపై చర్చను తిరిగి ప్రారంభించింది. ఇలాంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న ఉద్యోగులు అంతా ముందుకు వచ్చి తమ హక్కుల గురించి పోరాడాలని నైట్స్ ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై సెప్టెంబర్ త్రైమాసికంలో దేశంలోని 6 అతిపెద్ద ఐటీ కంపెనీలు అన్నీ కలిపి కేవలం 952 మంది ఉద్యోగుల్ని మాత్రమే చేర్చుకున్నట్లు వెల్లడి అయింది. ఇది అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 77 శాతం తగ్గింది. ఇక్కడ ప్రధానంగా టీసీఎస్‌లోనే ఉద్యోగుల సంఖ్య తగ్గింది. మిగతా 5 కంపెనీలన్నీ కలిపి 20వేల మందికిపైగా నియమించుకున్నాయి. ఇదే సమయంలో సైలెంట్ లేఆఫ్స్ అనే మరో అంశం తెరపైకి వచ్చింది. ఈ సంవత్సరం సుమారు 50వేల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోతారని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెద్ద, మధ్య స్థాయి టెక్ కంపెనీలు ఉద్యోగుల్ని సైలెంట్‌గా రాజీనామాలు చేయాలని ఇతరత్రా ఉద్యోగాలు చూసుకోవాలని బలవంతం చేస్తున్నట్లు వినిపిస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.